ప్రజాశక్తి

ఆదివారం 1 సెప్టెంబర్ 2024

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి



వినతిపత్రం అందజేస్తున్న సిఐటియు నాయకులు

రాజ్యసభ బృందానికి

వినతుల వెల్లువ

ప్రభుత్వ రంగ సంస్థలను పరిరక్షించాలని సిపిఎం, కార్మిక సంఘాల విజ్ఞప్తి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్, ఎంవిపి.కాలనీ

రాజ్యసభ సభ్యులు సుజీత్ కుమార్ నేతృత్వాన విశాఖ నగరంలో శనివారం పర్యటించిన రాజ్యసభ సభ్యుల పిటిషన్స్ కమిటీకి వినతులు వెల్లువెత్తాయి. ప్రభుత్వ రంగ సంస్థలకు సంబంధించిన పలు అంశాలపై కమిటీ చర్చించి, వినతులను స్వీకరించింది. ఈ క్రమంలోనే సిపిఎం, సిఐటియు వంటి కార్మిక సంఘాలు ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడాలంటూ వినతులు సమర్పించాయి. వాస్తవ పరిస్థితులను వివరించాయి.

స్టీల్‌ప్లాంట్‌పై..

త్యాగాలతో ఏర్పడిన వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలని కోరుతూ సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డాక్టర్ బి.గంగారావులతో కూడిన ప్రతినిధి బృందం నోవాటెల్ హోటల్‌లో రాజ్యసభ పిటిషన్ల కమిటీ ఛైర్మన్ సుజీత్ కుమార్‌కు వినతిపత్రం అందజేసింది. స్టీల్‌ప్లాంట్ పరిస్థితిని, తీసుకోవాల్సిన చర్యలను నాయకులు వివరించారు. రాష్ట్ర ప్రగతిలో కీలకమైన ఈ ప్లాంట్‌ను వంద శాతం ప్రైవేటీకరించాలని కేంద్ర కేబినెట్ నిర్ణయించిన దగ్గర నుంచి విశాఖ ఉక్కు కార్మికులు, ప్రజలు చేస్తున్న పోరాటాలను వివరించారు. ప్లాంట్‌కు ఎందుకు నష్టాలు వస్తున్నాయో తెలియజేశారు. ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలని, సొంత గనులు కేటాయించాలని, ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. దేశంలో సముద్ర తీర ప్రాంతాల్లో ఉన్న కీలకమైన ప్లాంట్ ఇదని గుర్తుచేశారు ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్ష మందికి ఉపాధి కల్పిస్తోందని, మూడు లక్షల కోట్ల ఆస్తి కలిగి ఉందని, సామాజిక న్యాయ కల్పన, విశాఖపట్నం, ఆంధ్ర రాష్ట్ర అభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తోందని వివరించారు.

హెచ్ఆర్ఎపై ఓటీ ఇప్పించాలని..

రక్షణ రంగంలో తక్షణం హెచ్ఆర్ఎపై ఓటీ ఇప్పించాలని నేవల్ సివిలియన్ ఎంప్లాయీస్ యూనియన్ గౌరవ అధ్యక్షులు రెడ్డి వెంకటరావు వినతిపత్రం సమర్పించారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ బ్రిడ్జిపై రాకపోకలను అనమతించాలని కోరారు.

విశాఖ నగరాన్ని పారిశ్రామిక ప్రాంతంతో అనుసంధానం చేసే ఈ బ్రిడ్జిపై రాకపోకలకు అనుమతి ంచకపోవడం వల్ల ప్రజలు, కార్మికులు ఇబ్బందులు పడుతున్నా రన్నారు. వినతిపత్రం మిగతా 2లో..



వినతిపత్రం అందజేస్తున్న రక్షణ రంగ నాయకులు



జోరువానలోనే సాగుతున్న ప్రయాణాలు

ఎడతెరిపిలేని వర్షం

◆ లోతట్టు ప్రాంతాలు జలమయం
◆ ప్రమాదకరంగా గుంతల రోడ్లు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో శనివారం ఎడతెరిపిలేని వాన కురిసింది. ముఖ్యంగా విశాఖ నగరంలో జనజీవనం స్తంభించింది. రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. విద్యా సంస్థలకు కలెక్టర్ ఆదేశం మేరకు సెలవు ప్రకటించారు. భారీ వర్షం కారణంగా రోడ్లపై చిరు దుకాణాల వారు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. దుకాణాలు తెరవలేని పరిస్థితి నెలకొంది. రోడ్లపై నడిచే టిఫిన్ సెంటర్లు చాలా వరకు మూతపడ్డాయి. భవన నిర్మాణ పనులకు వెళ్లే అడ్డా కూలీలు, మేస్త్రీలు ఇళ్లకే పరిమితమయ్యారు. నిత్యం రద్దీగా ఉండే పూర్ణా మార్కెట్‌లో సైతం ఎటువంటి వ్యాపార లావాదేవీలూ జరగలేదు. రైతు బజార్లకు ప్రజలు వెళ్లలేని పరిస్థితి ఎదురైంది.

మరోవైపు నగరంలోని లోతట్టు ప్రాంతాలు పూర్తిగా జలమయమయ్యాయి. పలుచోట్ల రోడ్లు దెబ్బతిన్నాయి. ముఖ్యంగా ఆర్టీసీ కాంప్లెక్స్, పూర్ణా మార్కెట్, దుర్గాలమ్మ గుడి, ప్రసాద్ గార్డెన్స్, చావుల మదుం, పోర్టు ప్రాంతంలోని బరోడా రోడ్డు, పాత పోస్ట్ ఆఫీస్, డాల్ఫిన్ జంక్షన్ నుంచి పూర్ణా మార్కెట్, పోర్టుకి వెళ్లే 70 అడుగుల రోడ్డుల్లో పెద్దపెద్ద గోతులు ఏర్పడి నీరు మిగతా 2లో..

డోలీమోతతో బాలింత తరలింపు

▶ వార్త 5లో..

మహిళా న్యాయవాదులు ఉన్నత శిఖరాలు చేరుకోవాలి

▶ వార్త 4లో..

'ఎసెన్షియా' మృతునికి నివాళి

▶ వార్త 5లో..

ప్రత్యేక రైళ్ల సేవలు కొనసాగింపు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ప్రయాణికుల అదనపు రద్దీని తగ్గించే క్రమంలో ప్రత్యేక రైళ్లను కొనసాగించాలని రైల్వే అధికారులు నిర్ణయించారు. అందులో భాగంగా 07221 సికింద్రాబాద్ - సంత్రాగచ్చి సమ్మర్ స్పెషల్ రైలు అక్టోబర్ 1 నుంచి డిసెంబర్ 31 వరకు ప్రతి మంగళవరం, శనివారం ఉదయం 6.45 గంటలకు సికింద్రాబాద్‌లో బయలుదేరి అదేరోజు సాయంత్రం 19:55 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. మరలా 19:50 గంటలకు బయలుదేరి మరుసటి రోజు 10.25 గంటలకు సంత్రాగచ్చి చేరుకుంటుంది. 07222 సంత్రాగచ్చి - విశాఖపట్నం వేసవి ప్రత్యేక రైలు అక్టోబర్ 2 నుంచి 2025 జనవరి 10 వరకు బుధవారం, ఆదివారం మధ్యాహ్నం 12.20 గంటలకు సంత్రాగచ్చి నుండి బయలుదేరి మరుసటి రోజు తెల్లవారుజామున 3.20 గంటలకు దువ్వాడ చేరుకొని మరలా 03.22 గంటలకు బయలుదేరి అదేరోజు మధ్యాహ్నం 15.00 గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుంది.

07030 సికింద్రాబాద్ - అగర్తల ప్రత్యేక రైలు అక్టోబర్ 7 నుండి డిసెంబర్ 30 వరకు ప్రతి సోమవారం సాయంత్రం 16:35 గంటలకు సికింద్రాబాద్‌లో బయలుదేరి మంగళవారం ఉదయం 4:20 గంటలకు విశాఖపట్నం చేరుకుని మరలా 4:40 గంటలకు బయలుదేరి గురువారం ఉదయం 3.10 గంటలకు అగర్తల చేరుకుంటుంది. 07029 అగర్తల - సికింద్రాబాద్ ప్రత్యేక రైలు అక్టోబర్ 11 నుండి 2025 జనవరి 3 వరకు ప్రతి శుక్రవారం ఉదయం 06.20 గంటలకు అగర్తలలో బయలుదేరి ఆదివారం తెల్లవారు జామున 3:05 గంటలకు విశాఖపట్నం చేరుకుని, మరలా 3:15 గంటలకు బయలుదేరి అదేరోజు సాయంత్రం 16:15 గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుంది.

07223 సికింద్రాబాద్ - సంత్రాగచ్చి ప్రత్యేక రైలు అక్టోబర్ 4 నుండి డిసెంబర్ 27 వరకు ప్రతి శుక్రవారం ఉదయం 7.05 గంటలకు సికింద్రాబాద్‌లో బయలుదేరి, అదేరోజు రాత్రి 19:55 గంటలకు దువ్వాడ మిగతా 2లో..

ఉపాధ్యాయ ఖాళీలు ఏవీ ?

◆ సర్దుబాటుతో భర్తీ ◆ ఆందోళనలో నిరుద్యోగులు ◆ డిఎస్‌సికి ప్రతిబంధకంగా మారిన జిఒ 117

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

జిఒ 117 ఆధారంగా తేల్చిన మిగులు ఉపాధ్యాయులను కూటమి ప్రభుత్వం ఖాళీల్లో సర్దుబాటు చేయడంతో డిఎస్‌సి పోస్టులు భారీగా తగ్గనున్నాయి. విద్యార్థి, ఉపాధ్యాయ నిష్పత్తి బదులు సెక్షన్ల ఆధారంగా ఉపాధ్యాయులను కేటాయించి గత ప్రభుత్వం భారీగా ఉపాధ్యాయ మిగులు చూపింది. ఈ జిఒను రద్దు చేసి, జిఒ 53 ప్రకారం విద్యార్థి, ఉపాధ్యాయ నిష్పత్తి ఆధారంగా ఉపాధ్యాయులను కేటాయించాలని నిరుద్యోగులు, యుటిఎఫ్ డిమాండ్ చేస్తున్నప్పటికీ ప్రభుత్వం 117 జిఒను రద్దు చేయకుండా, ఆ జిఒ ద్వారా మిగిలిన ఉపాధ్యాయులను సర్దుబాటు చేసింది. దీంతో మెగా డిఎస్‌సిలో ఎస్‌జిటి, స్కూల్ అసిస్టెంట్ పోస్టుల సంఖ్య తగ్గనుంది. గత ప్రభుత్వం 3, 4, 5 తరగతులను ఉన్నత పాఠశాలల్లో విలీనం చేసింది. విలీన తరగతులపై కూడా ఈ ప్రభుత్వం విధాన నిర్ణయం తీసుకోవడంలేదు. విలీనాన్ని రద్దు చేసి తిరిగి ప్రాథమిక పాఠశాలల్లో ఆ తరగతులను కలిపే ప్రయత్నం చేయడంలేదు.

విలీన తరగతుల రద్దు, విద్యార్థి, ఉపాధ్యాయ నిష్పత్తిని అమలుచేయకపోతే ప్రభుత్వం విడుదల చేయబోయే డిఎస్‌సి నోటిఫికేషన్ నిరుద్యోగులకు నిరాశ మిగల్చనుంది. మెగా డిఎస్‌సిపై నోటిఫికేషన్‌కు పెద్ద అవరోధంగా మారిన జిఒ 117ను ప్రభుత్వం రద్దు చేయకపోవడం విమర్శలకు తావిస్తోంది. గత ప్రభుత్వ విధానాలను తిరగదోడుతున్న కూటమి ప్రభుత్వం ఉపాధ్యాయుల మిగతా 2లో..

జిఒ 117ను రద్దు చేయాలి



గత ప్రభుత్వం ప్రయోగాత్మకంగా అమలుచేసిన జిఒ 117 విఫలమైందని విద్యాశాఖ గణాంకాలు చెబుతున్నాయి. ఆ జిఒను కూటమి ప్రభుత్వం రద్దు చేయాలి. జిఒ 53 ప్రకారం విద్యార్థుల సంఖ్య ఆధారంగా ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయులను కేటాయించాలి. మెగా డిఎస్‌సికి 117 జిఒ ఆటంకంగా వుంది. అశాస్త్రీయంగా విలీనం చేసిన 3, 4, 5 తరగతులను పునరుద్ధరించాలి.

జి.చినబ్బాయ్, యుటిఎఫ్ అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి

మొదటి పేజీ తరువాయి..

ఉపాధ్యాయ ఖాళీలు ఏవీ ?

రేషనలైజేషన్‌కు సంబంధించిన జిఒ 117ను సజీవంగా వుంచడంతో పాటు దానికి మరింత శక్తిని ఇస్తోంది. గతంలో ఉన్నత పాఠశాలల్లో 1:40 ఉపాధ్యాయ, విద్యార్థుల నిష్పత్తి వుండేది. గత ప్రభుత్వం ఆరు, ఏడు, ఎనిమిది తరగతుల విద్యార్థుల సంఖ్యను 53కు పెంచింది. తొమ్మిది, పది తరగతుల విద్యార్థుల సంఖ్యను 60కి పెంచి ఉపాధ్యాయులను తగ్గించింది. జిఒ 53ను పక్కనబెట్టి సెక్షన్ల ప్రాతిపాదికన ఉపాధ్యాయులను కేటాయించి విద్యాబోధనను అస్తవ్యస్తం చేసింది. జిల్లాలో గత ప్రభుత్వం మిగులుగా చూపిన 765 ఉపాధ్యాయుల్లోని కొంతమందితో 238 మంది ఉపాధ్యాయుల కొరతను ఈ ప్రభుతం సర్దుబాటు ద్వారా భర్తీ చేసింది. విద్యాశాఖ సమాచారం ప్రకారం ప్రస్తుతానికి హిందీ పోస్టులు 43 మినహా మిగిలిన పోస్టులు నామమాత్రంగా వున్నాయి. డిఎస్‌సి నోటిఫికేషన్ జారీకి జిఒ 117 ప్రతిబంధకంగా మారినా, ప్రభుత్వం ఆ జిఒను కొనసాగించడం నిరుద్యోగులకు నష్టం కలిగించనుంది.

ఎడతెరిపిలేని వర్షం

నిలిచిపోయింది. కొన్నిచోట్ల మ్యాన్ హోల్స్ తెరుచుకొని మురుగునీరు వర్షం నీరుతో కలిసి రోడ్లను ధ్వంసం చేసింది. ఈ ప్రాంతాల్లో రోడ్లు దుర్వాసనను వెదజల్లాయి.

వినతుల వెల్లువ

సమర్పించిన వారిలో యూనియన్ ప్రధాన కార్యదర్శి జి.అరుణ్ కుమార్ ఉన్నారు.

ఇతర ముఖ్య సమస్యలపై...

విశాఖ నగరంలో సంక్లిష్టమైన సమస్యలను పరిష్కరించాలంటూ సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్, జిల్లా కార్యదర్శి బి.జగన్, పబ్లిక్ సెక్టార్ కో - ఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ ఎస్.జోతీశ్వరరావులు వినతిపత్రం అందజేశారు. స్టీల్‌ప్లాంట్‌ను పరిరక్షించాలని కోరారు. ప్లాంట్‌కు రూ.15 వేల కోట్ల వర్కింగ్ క్యాపిటల్ కేటాయించాలని కోరారు. హిందుస్థాన్ షిప్‌యార్డ్ లిమిటెడ్ సమస్యలపైనా, విశాఖపట్నం పోర్టు సమస్యలపైనా, కార్మికులకు కనీస వేతనాలు అందకపోవడంపైనా వినతిపత్రంలో పేర్కొన్నారు. లేబర్ కోడ్స్‌ను ఉపసంహరించుకోవాలని కోరారు.

బ్యాంక్ ఆఫ్ బరోడా శాఖ ప్రారంభం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : బ్యాంక్ ఆఫ్ బరోడా విశాఖపట్నం రీజియన్ పరిధిలో పార్వతీపురం మన్యంలోని పాచిపెంటలో 43వ నూతన శాఖను శనివారం ఉదయం ప్రారంభించారు. బ్యాంకు విశాఖపట్నం రీజనల్ హెడ్ పిఎం.పధాన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విశాఖపట్నం రీజియన్ పరిధిలో ఖాతాదారులకు నమ్మకమైన సేవలను అందిస్తూ బ్యాంక్ దినదినాభివృద్ధి చెందుతోందన్నారు. కార్యక్రమంలో బ్యాంక్ డిప్యూటీ రీజనల్ మేనేజర్ సతీషా సాలుంకే, బ్రాంచ్ మేనేజర్ కె.భాను ప్రతాప్ పాల్గొన్నారు.



ప్రారంభోత్సవంలో పిఎం.పధాన్

ప్రజలకు మెరుగైన సేవలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖ నగర ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తున్నామని జివిఎంసి కమిషనర్ పి.సంపత్ కుమార్ తెలిపారు. శనివారం ఉదయం జివిఎంసి కార్యాలయం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ జివిఎంసి చేపట్టిన కార్యక్రమాల్లో వందరోజుల ప్రణాళికలలో భాగంగా నగరంలో 128 కిలోమీటర్ల మేజర్ డ్రెయిన్స్‌లో, 2,798 కిలోమీటర్ల మీడియమ్, మైనర్ డ్రెయిన్స్‌లో పూడికలను తొలగించి కాలువలను పరిశుభ్రం చేసినట్టు తెలిపారు. తాగునీరు కలుషితం లేకుండా చూస్తున్నామన్నారు. జ్వరాల నమోదును వివరించారు. జివిఎంసి లేఅవుట్ ఓపెన్ స్పేస్‌లను రక్షించడానికి చేపడుతున్న చర్యలను తెలిపారు.

ప్రతిరోజూ అర్జీల స్వీకరణ

జివిఎంసిలో ఇకపై ప్రతి రోజూ అర్జీలను స్వీకరించనున్నట్టు కమిషనర్ సంపత్ కుమార్ తెలిపారు. అందుకుగాను జివిఎంసి ప్రధాన కార్యాలయంలోగల హెల్ప్ డెస్క్‌ను ఆధునికీకరించి శనివారం ప్రారంభించారు. అన్ని పని దినాలలో ఉదయం 10.30 గంటల నుండి సాయంత్రం 5.00 గంటల వరకూ ఇక్కడ ఫిర్యాదులను స్వీకరించనున్నట్టు తెలిపారు.

ప్రత్యేక రైళ్ల సేవలు కొనసాగింపు

(మొదటి పేజీ తరువాయి..)

చేరుకుని మరలా 19:57 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 10.30 గంటలకు సంత్రాగచ్చి చేరుకుంటుంది. 07224 సంత్రాగచ్చి - సికింద్రాబాద్ ప్రత్యేక రైలు అక్టోబర్ 5 నుండి డిసెంబర్ 28 వరకు ప్రతి శనివారం మధ్యాహ్నం 12.20 గంటలకు సంత్రాగచ్చి నుంచి బయలుదేరి, మరుసటి రోజు ఉదయం 2:03 గంటలకు దువ్వాడ చేరుకుని మరలా 2:05 గంటలకు బయలుదేరి అదేరోజు మధ్యాహ్నం 14.45 గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుంది.

07225 సికింద్రాబాద్ - షాలిమార్ ప్రత్యేక రైలు అక్టోబర్ 14 నుండి డిసెంబర్ 30 వరకు ప్రతి సోమవారం ఉదయం 4.30 గంటలకు సికింద్రాబాద్‌లో బయలుదేరి, అదేరోజు మధ్యాహ్నం 14:30 గంటలకు దువ్వాడ చేరుకుని మరలా 14:35 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 6.05 గంటలకు షాలిమార్ చేరుకుంటుంది. 07226 షాలిమార్ - సికింద్రాబాద్ ప్రత్యేక రైలు అక్టోబర్ 15 నుండి డిసెంబర్ 31 వరకు ప్రతి మంగళవారం ఉదయం 10.00 గంటలకు షాలిమార్‌లో బయలుదేరి మరుసటి రోజు అర్ధరాత్రి 1:25 గంటలకు దువ్వాడ చేరుకుని మరలా 1:30 గంటలకు బయలుదేరి అదే రోజు మధ్యాహ్నం 13.00 గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుంది.

దువ్వాడ మీదుగా పండగ ప్రత్యేక రైళ్లు

పండగ సీజన్‌లో ప్రయాణికుల అదనపు రద్దీని తగ్గించడానికి డాక్టర్ ఎంజిఆర్ చెన్నయ్ సెంట్రల్-సంత్రాగచ్చి, తాంబరం - సంత్రాగచ్చి మధ్య ప్రత్యేక రైళ్లు నడపాలని రైల్వే శాఖ నిర్ణయించింది. ఈ క్రమంలో 06089 డాక్టర్ ఎంజిఆర్ చెన్నయ్ సెంట్రల్ - సంత్రాగచ్చి వీక్లీ స్పెషల్ సెప్టెంబరు 4 నుండి నవంబర్ 27 వరకూ ప్రతి బుధవారం మధ్యాహ్నం 13.30 గంటలకు డాక్టర్ ఎమ్‌జిఆర్ చెన్నయ్ సెంట్రల్ నుంచి బయలుదేరి మరుసటి రోజు ఉదయం 2.30 గంటలకు దువ్వాడ చేరుకొని మరలా బయలుదేరి 2.35 గంటలకు బయలుదేరి మరుసటి రోజు రాత్రి 20.50 గంటలకు సంత్రాగచ్చి చేరుకుంటుంది. 06090 సంత్రాగచ్చి-డాక్టర్ ఎంజిఆర్ చెన్నయ్ సెంట్రల్ వీక్లీ స్పెషల్ సెప్టెంబర్ 5 నుండి నవంబర్ 28 వరకు ప్రతి గురువారం రాత్రి 23.40 గంటలకు సంత్రాగచ్చి నుండి బయలుదేరి మరుసటిరోజు సాయంత్రం 16.55 గంటలకు దువ్వాడ చేరుకుని మరలా 17.00 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 9.00 గంటలకు డాక్టర్ ఎంజిఆర్ చెన్నయ్ సెంట్రల్‌కు చేరుకుంటుంది.

06095 తాంబరం - సంత్రాగచ్చి వీక్లీ స్పెషల్ సెప్టెంబరు 5 నుంచి నవంబర్ 28 వరకూ ప్రతి గురువారం మధ్యాహ్నం 13.00 గంటలకు తాంబరంలో బయలుదేరి మరుసటి రోజు తెల్లవారుజామున 2.30 గంటలకు దువ్వాడ చేరుకుని మరలా 02.35 గంటలకు బయలుదేరి అదేరోజు రాత్రి 20.50 గంటలకు సంత్రాగచ్చి చేరుకుంటుంది. 06096 సంత్రాగచ్చి - తాంబరం వీక్లీ స్పెషల్ 6 సెప్టెంబర్ నుంచి 29 నవంబర్ వరకు ప్రతి శుక్రవారం రాత్రి 23.50 గంటలకు సంత్రాగచ్చి నుండి బయలుదేరి, మరుసటి రోజు సాయంత్రం 16.55 గంటలకు దువ్వాడ చేరుకుని మరలా 17.00 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 9.45 గంటలకు తాంబరం చేరుకుంటుంది.

ఇండియన్ బ్యాంక్ సర్ఫాసీ అసెట్స్ ఫెయిర్ ప్రారంభం

ప్రజాశక్తి - సీతమ్మధార : ఇండియన్ బ్యాంక్ జోనల్ కార్యాలయం విశాఖపట్నం అధ్వర్యంలో సర్ఫాసీ చట్టం పరిధిలో అసెట్స్ ఫెయిర్-2024ను స్థానిక ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ప్రారంభించారు. ఈ ఆస్తుల ప్రదర్శన కార్యక్రమాన్ని ఇండియన్ బ్యాంక్ జోనల్ మేనేజర్ అవధేష్ కుమార్ పుర్బే ఆరంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ అసెట్స్ ఫెయిర్‌లో విశాఖపట్నం, రాజమహేంద్రవరం జోన్లకు సంబంధించిన ఎన్‌పిఎ పరిధిలోని ఆస్తులకు సంభంధించిన వివరాలును ఉంచినట్టు తెలిపారు. ఈ ఫెయిర్ ఆస్తులలో ఫ్లాట్స్, స్థలాలు, గృహాలు, పారిశ్రామిక/వాణిజ్య ఆస్తులు సుమారు 100కిపైగా ఉన్నట్లు తెలిపారు. పైన చెప్పిన ఆస్తులన్నీ అక్టోబర్ వరకూ విక్రయానికి సిద్ధంగా ఉండనున్నట్టు రికవరీ చీఫ్ మేనేజర్ అజీముద్దీన్ అహ్మద్ ఇర్ఫాన్ తెలిపారు. ఆస్తుల పూర్తి సమాచారం కోసం ఖాతాదారులు సమీప ఇండియన్ బ్యాంక్ శాఖలను సంప్రదించాలని కోరారు. ఈ అసెట్స్ ఫెయిర్‌లో ఇండియన్ బ్యాంక్ అన్ని శాఖల సిబ్బంది, ఖాతాదారులు, ప్రజలు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : సీనియర్ వీడియో జర్నలిస్ట్ శ్రీధర్‌కు మాజీ ఎమ్మెల్యే, దక్షిణ వైసిపి సమన్వయకర్త వాసుపల్లి గణేష్ కుమార్ శనివారం రూ.10 వేలు ఆర్థిక సాయం చేశారు. ఇటీవల న్యూస్ కవరేజ్ లో ప్రమాదవశాత్తు ఎడమ చేయి విరిగిపోవడంతో శ్రీధర్ కొద్దిరోజులుగా ఇంటి వద్ద చికిత్స పొందుతున్నాడు.

అన్న క్యాంటీన్‌కు విరాళం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : అన్న క్యాంటీన్ పథకానికి 22వ వార్డు జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ రూ.లక్షా 20 వేలు విరాళాన్ని అందించారు. ఆ మొత్తాన్ని రాష్ట్ర ఐటి, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్‌కు చెక్కు రూపంలో అందజేశారు.

2న రక్తదాన శిబిరం

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రం (సిహెచ్‌సి)లో ఈ నెల 2వ తేదీన రక్త దాన శిబిరం నిర్వహించనున్నట్లు వైద్యాధికారి శనివారం తెలిపారు. రాష్ట్ర డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ పుట్టిన రోజు సందర్భంగా నగరంలోని ప్రభుత్వ విక్టోరియా జనరల్ ఆసుపత్రిలోని బ్లడ్ బ్యాంక్ సిబ్బంది సహకారంతో ఉదయం 10 గంటలకు రక్త దాన శిబిరం ప్రారంభిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

నేడు విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి -ఆనందపురం : పరదేశిపాలెం 11కెవి సబ్ స్టేషన్, బోయపాలెం ఇండస్ట్రియల్, పరదేశిపాలెం, లైన్ పనుల నిమిత్తం ఆదివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ ఎఇ సురేష్‌కుమార్ తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు బోయపాలెం, గంభీరం, కొత్త కళ్లివానిపాలెం తదితర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

విజ్ఞాన్‌లో గ్రాండ్ పేరెంట్స్ డే

ప్రజాశక్తి -భీమునిపట్నం : జివిఎంసి నాలుగో వార్డు తిమ్మాపురం, విజ్ఞాన్ వరల్డ్ వన్ పాఠశాలలో శనివారం గ్రాండ్ పేరెంట్స్ డే నిర్వహించారు. విద్యార్థులు, గ్రాండ్ పేరెంట్స్‌తో కలిసి వేడుకల్లో పాల్గొన్నారు. వేడుకల్లో పాల్గొన్న తాతయ్యలు, నాయనమ్మలు, వారి మనవలు, మనవరాళ్లతో తమ అనుభూతిని, అనుభవాలను పంచుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్య ప్రతినిధులు వారిని సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల సిఇఒ నందిగామ శ్రీకాంత్, ప్రిన్సిపల్స్ చైతన్య, పద్మావతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గణపతి ఉత్సవాల రాట ప్రతిష్ఠ

ప్రజాశక్తి - యంత్రాంగం

ఆరిలోవ : జివిఎంసి 12వ వార్డు పరిధి పెదగదిలి ప్రాంతంలో యంగ్ స్టార్ బాయ్స్ ఆధ్వర్యాన శనివారం గణపతి ఉత్సవాల రాట ప్రతిష్ఠ నిర్వహించారు. ఏటా మాదిరిగానే ఈ ఏడాది కూడా గణపతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు దువ్వి సంతోష్, రాజశేఖర్, శివ, గొలగాని ప్రదీప్, పొట్టి జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

ఆనందపురం : వేములవలస గ్రామంలో వినాయక ఉత్సవాలకు శనివారం పంచాయతీ ఉపసర్పంచ్ కోరాడ నవీన్ జ్ఞానేశ్వర్ ముహూర్తపు రాట వేశారు. ఈ కార్యక్రమంలో కోరాడ మహేష్, బోద అప్పలరాజు, కోరాడ గణేష్, కోరాడ కిరణ్ కుమార్, పతివాడ సంతోష్, పతివాడ హేమంత్ కుమార్, బోద వినయ్ కుమార్, చందక గణేష్, వడ్ల బాలు, పతివాడ రాజు, పాలూరి రాజు పాల్గొన్నారు.

ఎన్ఎస్ఆర్ఐటిలో గ్రాడ్యుయేషన్ వేడుకలు

ప్రజాశక్తి -ఆనందపురం : మండలంలోని సొంట్యాం వద్ద గల నడిపల్లి సత్యనారాయణ రాజు ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో శనివారం ప్రథమ అటానమస్ బీటెక్ గ్రాడ్యుయేషన్ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బెంగళూరు సిమెన్స్ సీనియర్ మేనేజర్ మురళి పూటాడ, జెఎన్‌టియు ఇన్చార్జ్ వైస్ ఛాన్సలర్ డి.రాజ్యలక్ష్మి, టెక్ మహీంద్రా గ్రూప్ డెలివరీ హెడ్ వైస్ ప్రెసిడెంట్ మల్లాది నాగార్జున హాజరయ్యారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్ శంభుప్రసాద్ మాట్లాడుతూ బీటెక్ గ్రాడ్యుయేషన్ పూర్తిచేసిన మొత్తం 546 మంది ఉద్యోగ అవకాశాలు సాధించారన్నారు. వారిలో రూ.29 లక్షలు వార్షిక వేతనం పొందిన విద్యార్థులు ఉన్నారని తెలిపారు.

చిట్టీల పేరుతో మోసం చేసిన మహిళపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - ఆరిలోవ : చిట్టీల పేరుతో మోసం చేసిన మహిళపై చర్యలు తీసుకోవాలని, మోసపోయిన స్థానికులకు న్యాయం చేయాలని ఐద్వా డిమాండ్ చేసింది. ఆరిలోవ కాలనీకి చెందిన లక్ష్మి చిట్టీలు కట్టించుకుంటూ రూ.3 కోట్లతో పరారైంది. ఆరిలోవ కాలనీకి చెందిన సుమారు 120 మంది మహిళలు కూలి పనులు చేసుకుంటూ కొంత మొత్తంతో లక్ష్మి వద్ద చిట్టీలు వేసేవారు. గత కొంత కాలంగా పాడుకున్న వారికి చిట్టీ డబ్బులు ఇవ్వకపోవడంతో ఆమెపై ఒత్తిడి చేశారు. దీనిపై పోలీసులకు కూడా ఫిర్యాదు చేశారు. పోలీసులు కూడా తమకు న్యాయం చేయలేదని మోసపోయిన మహిళలు విలపిస్తున్నారు. పోలీసులు వెంటనే చర్యలు తీసుకొని, బాధితులకు న్యాయం చేయాలని ఐద్వా ఆరిలోవ జోన్ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.రంగమ్మ, ఎల్.గౌరి డిమాండ్ చేశారు.

సిహెచ్‌సి కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రం (సిహెచ్‌సి)లో పనిచేస్తున్న శానిటేషన్ సెక్యూరిటీ గార్డులు, చెద పురుగుల నివారణ నిమిత్తం పనిచేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఎపి మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) జిల్లా ప్రధాన కార్యదర్శి కోన లక్ష్మణ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆసుపత్రి సూపరింటెండెంట్‌కు శనివారం వినతి పత్రం అందజేశారు. బకాయి పడిన నాలుగు నెలల వేతనాలు చెల్లించాలని, పిఎఫ్, ఇఎస్ఐ సదుపాయం కల్పించాలని కోరారు. ప్రభుత్వాలు మారినప్పుడల్లా కార్మికులను తొలగించాలన్న నిర్ణయాన్ని మార్చుకోవాలని, కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్‌చేశారు. సమస్యలు పరిష్కరించకుంటే ఈ నెల 15వ తేదీ నుంచి విధులు బహిష్కరించనున్నట్లు తెలిపారు. వినతిపత్రం అందజేసిన వారిలో యూనియన్ నాయకులు దువ్వాడ కాశి, సుందర్, పలువురు కార్మికులు ఉన్నారు.

కెజిబివికి దివీస్ ప్రోత్సాహం

ప్రజాశక్తి -భీమునిపట్నం : జివిఎంసి మూడో వార్డు పరిధి గొల్లలపాలెంలో ఉన్న కెజిబివి పాఠశాలకు చిప్పాడలోని దివీస్ సంస్థ అనేక విధాలుగా ప్రోత్సాహం అందిస్తుందని ప్రిన్సిపల్ గంగాకుమారి తెలిపారు. ఆర్వో ప్లాంట్ ఏర్పాటు, విద్యార్థినులకు సైన్స్ ల్యాబ్, బోధనోపకరణాలు, డిజిటల్ క్లాస్ రూమ్‌ల ఏర్పాటు, గ్రంథాలయానికి పుస్తకాలు, ఏటా టెన్త్ విద్యార్థులకు మోడల్ పేపర్లకు సంబంధించి పుస్తకాలు తదితర రూపాల్లో సహకారం అందించినట్లు పేర్కొన్నారు. మంత్రి నారా లోకేష్ శుక్ర వారం పాఠశాలను తనిఖీ చేసిన సందర్భంగా దివీస్ అందజేసిన సహకారాన్ని తాము మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ఈ క్రమంలో అక్కడనే ఉన్న దివీస్ సిఎస్ఆర్ మేనేజర్ సురేష్ కుమార్‌ను మంత్రి లోకేష్ అభినందించారు. పాఠశాలకు వచ్చేందుకు రోడ్డును పునర్నిర్మించాలని, క్రీడా మైదానాన్ని నెలకొల్పాలని దివీస్ సంస్థను ప్రిన్సిపాల్ కోరారు.

గురుకుల పాఠశాలను సందర్శించిన ఎమ్మెల్యే గణబాబు



గురుకుల పాఠశాలలో సైన్స్ ల్యాబ్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గణబాబు

ప్రజాశక్తి -గోపాలపట్నం : జివిఎంసి 92వ వార్డు పరిధి వెంకటాపురం శివారు మేఘాద్రిగెడ్డ సమీపంలోని అంబేద్కర్ గురుకుల బాలికల వసతి గృహాన్ని పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గణబాబు సందర్శించారు. వసతి గృహంలోని సదుపాయాల గురించి విద్యార్థులనడిగి తెలుసుకున్నారు. వంట గదులను పరిశీలించారు. భోజనాన్ని స్వయంగా పరీక్షించారు.

సైన్స్ పరికరాలు అందజేత

బాపట్ల జిల్లాకు చెందిన కీర్తిశేషులు గోరంట్ల దానయ్య, శేషారత్నం జ్ఞాపకర్థంగా వారి కుమారుడు గోరంట్ల వాసుబాబు, సరళదేవి దంపతులు, మనవరాలు హిమబిందు ఆర్థిక సహాయంతో గురుకుల పాఠశాలకు సైన్సు ప్రయోగశాల పరికరాలు, బోధనా అభ్యసన సామగ్రిని బాలికల వసతి గృహానికి బహూకరించారు. ఈ సైన్స్ పరికరాలను ఎమ్మెల్యే గణబాబు ప్రారంభించారు.

నేరాలు ఘోరాలు

భార్యను హత్య చేసిన భర్త

ప్రజాశక్తి -పద్మనాభం : మండల కేంద్రమైన పద్మనాభంలో అనుమానంతో భార్యను భర్త హత్యచేశాడు. దీనికి సంబంధించి పోలీసుల కథనం ప్రకారం... పద్మనాభం గ్రామానికి చెందిన చిప్పలి వెంకటలక్ష్మి (26) విజయనగరం జిల్లా కొండకరకం గ్రామానికి చెందిన చిప్పలి భూలోక (30)కు ఎనిమిదేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్యపై అనుమానంతో శుక్రవారం రాత్రి 11, 12 గంటల మధ్యలో వారి మధ్య వివాదం తలెత్తింది. ఈ గొడవలో భార్యను పీక నులిమి చంపేసినట్లు పోలీసులు గుర్తించారు. భార్య చనిపోవడంతో భర్త భూలోక కత్తితో పొడిచుకొని అర్ధరాత్రి సమయంలో ఇంట్లో నుంచి బయటకు వచ్చి కేకలు వేశాడు. స్థానికులు పద్మనాభం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని గాయాలతో ఉన్న భూలోకను విజయనగరంలోని మహారాజా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో కెజిహెచ్‌కు తరలించారు. వెంకటలక్ష్మి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భీమిలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ కేసును పద్మనాభం సిఐ శ్రీధర్ దర్యాప్తు చేస్తున్నారు.

పిల్లల పరిస్థితి దయనీయం

తల్లి మృతి చెందడం, తండ్రి ఆసుపత్రిలో ఉండటంతో పిల్లల పరిస్థితి దయనీయంగా మారింది. అనుమానం పెనుభూతంగా మారడంతో ఇద్దరు చిన్న పిల్లలపై ప్రభావం పడింది. తండ్రి బతికినా కేసు విషయంలో జైలుకు వెళ్లే పరిస్థితి ఉంటుంది. దీంతో పిల్లలు అఖిల్ (4), అక్షిత (2) తల్లిదండ్రులకు దూరమై అనాథలుగా మారుతున్నారు. భూలోక భార్యతో ఎప్పుడూ గొడవపడి సొంత గ్రామానికి వెళ్లిపోయి అప్పుడప్పుడు వచ్చేవాడిని స్థానికులు చెబుతున్నారు.

బైక్‌ను ఢీకొన్న కారు

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని ఎర్రవరం వద్ద ద్విచక్ర వాహనాన్ని ఎదురుగా వస్తున్న కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో జోగంపేట గ్రామానికి చెందిన బొచ్చా శ్రీరామమూర్తికి తీవ్ర గాయాలయ్యాయి. శ్రీరామ్మూర్తి కూరగాయలు తీసుకొని నర్సీపట్నం మార్కెట్ కు వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది. వెంటనే స్థానికులు స్పందించి గాయపడ్డ వ్యక్తిని నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తరలించారు.

పంటలను పరిశీలించిన ఉద్యాన శాఖ అధికారులు

ప్రజాశక్తి -ఆనందపురం : జిల్లా ఉద్యాన శాఖ అధికారి కె.సత్యనారాయణ శనివారం వేములవలస బిపి కల్లాలలో వంగ, బంతి తోటలను పరిశీలించారు. రైతులతో మాట్లాడారు. వర్షాల వల్ల ఉద్యానవన పంటలకు తెగులు రాకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. వర్షాలు తగ్గుముఖం పట్టాక బ్లైటాక్స్ కాపర్ ఆక్సిక్లోరైడ్ మూడు గ్రాములు ఒక లీటర్ నీటికి కలిపి వేర్ల దగ్గర డ్రంచింగ్ చేయాలని చెప్పారు. నీరు నిల్వ లేకుండా పొలాల్లో పలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

పెన్షన్ల పంపిణీ

ప్రజాశక్తి -యంత్రాంగం

ప్రభుత్వం సామాజిక పెన్షన్లను ఒక్కరోజు ముందుగానే పంపిణీ చేపట్టింది. సెప్టెంబర్ 1వ తేదీ ఆదివారం కావడంతో ఆగస్టు 31వ తేదీనే పెన్షన్లు పంపిణీచేశారు. శనివారం అందని వారికి సోమవారం పెన్షన్లు పంపిణీచేయనున్నారు.

మధురవాడ : జివిఎంసి 8వ వార్డు పరిధి ఎండాడలో పెన్షన్లను భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు పంపిణీచేశారు. ఈ కార్యక్రమంలో భీమిలి జనసేన ఇన్‌ఛార్జి సందీప్ పంచకర్ల, కార్పొరేటర్ ఎన్.అప్పారావు, శాఖరి శ్రీనుబాబు, చెట్టుపల్లి గోపి తదితరులు పాల్గొన్నారు.

సీతమ్మధార : 29వ వార్డులోని అమెరికన్ హాస్పిటల్ వృద్ధాశ్రమంలో వృద్ధులకు దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్‌తో కలిసి నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి సీతంరాజు సుధాకర్ పెన్షన్లు పంపిణీచేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ఉరుకూటి నారాయణరావు, జోనల్ కమిషనర్ పాల్గొన్నారు.

తాటిచెట్లపాలెంలో స్థానిక నాయకులతో కలిసి జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ పెన్షన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కంపా హనుక్, డిఆర్‌డిఎ పీడీ శోభారాణి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అనకాపల్లి ప్రతినిధి : జిల్లాలో వర్షాలు కురిసినా శనివారం పింఛన్ల పంపిణీ యథాతథంగా సాగింది. సచివాలయ సిబ్బంది గొడుగులు పట్టుకొని సాయంత్రం ఆరు గంటల వరకు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు. డిఆర్‌డిఎ ప్రాజెక్టు డైరెక్టర్ శచీదేవి, డిపిఎం పి.వెంకటరమణ క్షేత్రస్థాయిలో పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు చేశారు. జిల్లాలో 2,61,800 మంది పింఛనుదారుల్లో 2,47,781 మందికి (94.54 శాతం) పింఛన్ డబ్బులు అందజేశారు.



పింఛన్లు పంపిణీ చేస్తున్న అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్

సబ్బవరం : మండలంలోని బాటజంగాలపాలెం గ్రామంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ శనివారం పాల్గొని పింఛన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో అన్ని మండలాల్లో పింఛను పంపిణీ కార్యక్రమం చురుగ్గా జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రమేష్ నాయుడు, ఈఓపిఆర్‌డి మహేష్, వెలుగు ఏపిఎం సాయి రమేష్, సర్పంచ్ పడాల వెంకటరమణ, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

అనకాపల్లి : అనకాపల్లి రెల్లి వీధి, అంజయ్య కాలనీ, అనకాపల్లి మండలంలోని శంకరం, రేబాక గ్రామాలలో అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ పింఛన్లు అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ శాసనసభ్యులు పీలా గోవింద సత్యనారాయణ, కూటమి నాయకులు మళ్ల సురేంద్ర, బివిఎన్నే జోగినాయుడు, బొడ్డేడ మురళి తదితరులు పాల్గొన్నారు.

నక్కపల్లి: చరిత్రలో మొదటిసారి ఒక్కరోజు ముందే అవ్వా తాతలకు పింఛన్లు అందజేయడం జరిగిందని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. పాయకరావుపేటలో బృందావనం కాలనీలో శనివారం ఆమె పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. పింఛన్లు నగదు అందజేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

నర్సీపట్నం టౌన్: నర్సీపట్నం మండలం ధర్మసాగరం గ్రామంలో పింఛన్లను రాష్ట్ర శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు పంపిణీచేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ, పింఛన్ల పంపిణీ కొనసాగుతుందన్నారు. అనర్హులైన వారిని తొలగించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని, డ్వాక్రా గ్రూపు మహిళలందరూ మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సుకల రమణమ్మ, ఎంపిడిఒ ఎన్.జయమాధవి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీపై అసహనం

కొత్తకోట: రావికమతం మండలంలో వివిధ గ్రామాలలో శనివారం ఉదయం 8:30 గంటల వరకు పెన్షన్ పంపిణీ ప్రారంభం కాకపోవడంపై డిఆర్‌డిఎ పిడి కె.సచీదేవి అసహనం వ్యక్తం చేశారు. పెన్షన్లు పంపిణీ పర్యవేక్షణకు మండల పరిషత్ కార్యాలయానికి వచ్చారు. ఈ సందర్భంగా పంపిణీ కోసం నియమించిన 189 మందిలో ఆరుగురు ఉదయం 8.30కి కూడా పెన్షన్లు పంపిణీ ప్రారంభించ లేదని గుర్తించారు. ఈ సిబ్బందికి సంబంధించిన శాఖ ఉన్నతాధి కారులతో ఫోన్లో మాట్లాడి ఆలస్యానికి కారణం తెలియజేయాలని ఆదేశించారు.

ఇపిఎస్ 95 పెన్షనర్ల డిమాండ్లు నెరవేర్చాలి

ప్రజాశక్తి-ఉక్కునగరం : ఇపిఎస్ 95 పెన్షనర్ల డిమాండ్లు నెరవేర్చాలని ఇపిఎస్ 95 పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నేషనల్ గౌరవాధ్యక్షులు మంత్రి రాజశేఖర్ కోరారు. ఇపిఎస్ 95 పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం ఉక్కునగరం స్టీల్ ఎగ్జిక్యూటివ్స్ అసోసియేషన్ సి భవన్‌లో నిర్వహించారు. అసోసియేషన్ నేషనల్ వైస్ ప్రెసిడెంట్ మార్టూరు శ్రీనివాసరావు ఆధ్వర్యాన జరిగిన ఈ సమావేశంలో మంత్రి రాజశేఖర్ మాట్లాడుతూ, న్యాయమైన కోరికలు తీర్చాలని కోరుతూ కేంద్ర ప్రభుత్వానికి ఇపిఎస్ 95 పెన్షనర్లు ఎన్నో అర్జీలు పెట్టుకున్నారని, ఢిల్లీలో ధర్నా కూడా చేశారని గుర్తుచేశారు. కనీసం రూ.9000 పెన్షన్ ఇవ్వాలని, మెడికల్ సదుపాయం కల్పించాలని కోరుతున్నా మోడీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. రూ.1000 నుంచి రూ.2 వేలు పెన్షన్ వస్తుందని, ఎటూ సరిపోక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. పెన్షనర్ల సొమ్ము రూ.20 లక్షల కోట్లుపైన ఉంటుందని, దానిపైన వచ్చే వడ్డీనే వీరు అడుగుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ కె.రాజశేఖర్, టిఎస్ఆర్ కృష్ణారెడ్డి, ఎల్.మురళీకృష్ణ, బివిఎస్.రాజు, ఇ.సాంబశివరావు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణపై అవగాహన కల్పించాలి

ప్రజాశక్తి -ములగాడ : విద్యార్థుల్లో జ్ఞానాన్ని, నైపుణ్యాలను పెంచడంతో పాటు క్రమశిక్షణను, దేశం గురించిన అవగాహనను పెంచాలని ఆంధ్ర విశ్వవిద్యాలయ రెక్టార్ ఆచార్య ఎన్.కిషోర్‌బాబు అన్నారు. స్థానిక సెయింట్ ఆన్స్ కళాశాలకు స్వయం ప్రతిపత్తి హోదా వచ్చిన సందర్భంగా కళాశాలలో అకడమిక్ కౌన్సిల్ సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి కిషోర్‌బాబు మాట్లాడుతూ, విద్యార్థుల జీవన నైపుణ్యాలను పెంచడంపై అధ్యాపకులు దృష్టి పెట్టాలన్నారు. ఆచార్య డి.లలిత భాస్కరి మాట్లాడుతూ, మహిళలకు క్రమశిక్షణ, నైపుణ్యాలు పుట్టుకతోనే ఉంటాయన్నారు. ప్రతి అధ్యాపకురాలు విద్యార్థులను సొంత బిడ్డల్లా చూసుకోవాలని సూచించారు. ఆచార్య నానాజీ మాట్లాడుతూ, మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాలను నిరోధించడంపై ప్రతి కళాశాలలో ప్రత్యేక కమిటీ ఉండాలన్నారు. సమావేశంలో హెచ్‌పిసిఎల్ మేనేజర్ భారతి, విజ్ఞాన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ నుంచి ఆచార్య ఆర్.సుందరరామం, సెయింట్ జోసెఫ్స్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిస్టర్ షైజీ, సెయింట్ ఆన్స్ కళాశాల కరస్పాండెంట్ సిస్టర్ గెసిల్లా, ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ ప్రేమ కుమారి ప్రసంగించారు. కార్యక్రమంలో అకడమిక్ అడ్మినిస్ట్రేటర్ జయశ్రీ, రాజనీతి శాస్త్ర విభాగాధిపతి ఇపిఎస్.భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్‌గా కింజరాపు బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-సీతమ్మధార : ఎన్‌సిగా ప్రమోషన్ పొందిన కింజరాపు వెంకట రామకృష్ణ ప్రసాద్ శనివారం ఏపీఈపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పలువురు ఆయనకు అభినందనలు తెలిపారు.

ప్రత్యేక అధికారుల నియామకంపై హర్షం

ప్రజాశక్తి-మాధవధార : ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లో విస్తృతంగా తీసుకెళ్లేందుకు కూటమి ప్రభుత్వం ప్రతి జిల్లాకు ప్రత్యేక అధికారులను నియమించడం హర్షదాయకమని రాష్ట్ర ఒబిసి డిపార్ట్‌మెంట్ చైర్మన్ మూల వెంకటరావు పేర్కొన్నారు. ప్రత్యేక అధికారులుగా బాధ్యతలు చేపట్టే సీనియర్ అధికారులు రాష్ట్రాభివృద్ధి, సామాజిక సమతుల్యత, ఆర్థిక వనరులను దృష్టిలో ఉంచుకొని ఆయా శాఖల మంత్రులకు సలహాలివ్వాలని విజ్ఞప్తి చేశారు.

పాఠశాలల్లో ప్రహరీ క్లబ్‌లు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి -కరాస: బాలల హక్కుల కమిషన్ ఆదేశాలు, ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ ఉత్తర్వులననుసరించి అన్ని పాఠశాలల్లో తక్షణమే ప్రహరీ క్లబ్‌లు ఏర్పాటు చేయాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం పేర్కొన్నారు. దీనిపై అన్ని యాజమాన్యాల పాఠశాలల పాత్రపై శనివారం ఎన్ఎడి సమీపంలోని సరస్వతి విద్యావిహార్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు. గర్ల్ చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ ఖలీషా బేగం, గోపాలపట్నం ఎంఇఒ ఎ.సోమేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సదస్సులో సీతారాం మాట్లాడుతూ, శత శాతం పిల్లల్లో మాదక ద్రవ్యాలపై దృష్టి మరల్చకుండా అవగాహనా కార్యక్రమాలు, బాలలపై లైంగిక దాడులు నిర్మూలన, మంచి, చెడు స్పర్శపై పిల్లల్లో అవగాహన, ఆడపిల్లల రుతుస్రావం సమయంలో మానసిక ఒత్తిడి లేకుండా ఆరోగ్య సూత్రాలు పాటించడం, బాలల హక్కులు, చట్టాలపై అవగాహన కార్యక్రమాలు, పిల్లలు ఫిర్యాదులు చేసేందుకు వీలుగా పాఠశాలల ప్రాంగణాల్లో ఫిర్యాదుల పెట్టెలు ఏర్పాటు, వాటి పరిశీలనపై దృష్టి సారిస్తున్నామని తెలిపారు.

విశాఖ ఉక్కును సెయిల్‌లో విలీనం చేయాలి

ఎఐటియుసి జాతీయ సమితి ప్రధాన కార్యదర్శి అమర్‌జిత్ కౌర్

ప్రజాశక్తి-ఉక్కునగరం : విశాఖ ఉక్కు కర్మాగారాన్ని సెయిల్‌లో విలీనం చేసి, నూటికి నూరు శాతం ఉత్పత్తి సామర్థ్యంతో నడపాలని, మిగిలి ఉన్న నిర్వాసితులకు శాశ్వత ఉపాధి కల్పించాలని, కాంట్రాక్టు కార్మికులకు జీతాల్లో కోత విధించరాదని ఎఐటియుసి జాతీయ సమితి ప్రధాన కార్యదర్శి అమర్‌జిత్ కౌర్ ఉక్కు యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. ఎఐటియుసి ఆధ్వర్యాన ఉక్కు ఎల్ అండ్ డిసి వద్ద శనివారం ధర్నా నిర్వహించారు. ఈ ధర్నానుద్దేశించి ఆమె మాట్లాడుతూ, ఉద్యమాల ద్వారా ఏర్పాటైన ఉక్కు కర్మాగారాన్ని కేంద్ర ప్రభుత్వం తన అనుకూలురైన పెట్టుబడిదారులకు కారుచౌకగా కట్టబెట్టే ప్రయత్నాలను ముమ్మరం చేసిందన్నారు. దీనిని ఎఐటియుసి తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు. కేంద్రం ఉక్కుకు కావలసిన ఐరన్ ఓర్, ఇతర ముడిసరుకులు సరఫరా చేసి ప్లాంట్ మనుగడకు కృషిచేయాలని కోరారు. విశాఖ ఉక్కును ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని, లేకుంటే కలిసి వచ్చే కార్మిక సంఘాలతో ఐక్య ఉద్యమాన్ని ఎఐటియుసి తీవ్రతరం చేస్తుందని స్పష్టంచేశారు. ఈ ధర్నాలో ఎఐటియుసి నాయకులు ఆర్.రవీంద్రనాథ్, జి.ఓబులేసు, కెఎస్ఎన్.రావు, డి.ఆదినారాయణ, జె.రామకృష్ణ, మసేన్‌రావు, కె.రాజబాబు తదితరులు పాల్గొన్నారు.



ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న అమర్‌జిత్ కౌర్

నేటి నుంచి ఎఐటియుసి జాతీయ సమావేశాలు

ప్రజాశక్తి-ఉక్కునగరం : ఉక్కునగరంలోని గురజాడ కళా క్షేత్రంలో ఆదివారం నుంచి మూడు రోజుల పాటు ఎఐటియుసి జాతీయ సమితి సమావేశాలు జరగనున్నాయి. సమితి సమావేశాల ముగింపు సందర్భంగా మంగళవారం విశాఖ నగరంలో కార్మిక ప్రదర్శన, జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద బహిరంగ సభ నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. మూడు రోజుల పాటు జరిగే జాతీయ సమితి సమావేశాలకు దేశ వ్యాప్తంగా 300 మంది ప్రతినిధులు హాజరుకానున్నారు. ఈ సమావేశాలలో ఎఐటియుసి జాతీయ సమితి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రమేంద్ర కుమార్, అమర్జీత్ కౌర్ తదితరులు పాల్గొననున్నారు. ఈ సమావేశాలలో దేశవ్యాప్తంగా కార్మికవర్గం ఎదుర్కొంటున్న సమస్యలు, వారి హక్కుల కోసం, ప్రభుత్వ రంగ పరిశ్రమల పరిరక్షణపై పలు తీర్మానాలను ప్రవేశపెట్టి, చర్చ జరిగిన అనంతరం ఆమోదిస్తారని ఎఐటియుసి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమితి ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు, అధ్యక్షులు ఆర్.రవీంద్రనాథ్, జాతీయ ఉపాధ్యక్షులు డి.ఆదినారాయణ, కెఎస్ఎన్.రావు, జాతీయ సమితి సభ్యులు జె.రామకృష్ణ తెలిపారు.

ఉక్కునగరం ముస్తాబు

ఎఐటియుసి జాతీయ సమితి సమావేశాలు సందర్భంగా ఉక్కునగరంలోని పలు కూడళ్లలో యూనియన్ జెండాలు, తోరణాలతో అలంకరించారు.

గెడ్డల్లో అడ్డుపడిన చెట్లు తొలగింపు

ప్రజాశక్తి-వేపగుంట : ఇటీవల కురుస్తున్న వర్షాలకు గోపాలపట్నం బాపూజీనగర్‌లో చెట్లు విరిగి గెడ్డలలో పడిన కొమ్మలను జివిఎంసి సిబ్బంది తొలగించారు. ఎమ్మెల్యే గణబాబు ఆదేశాలతో, జోనల్ కమిషనర్ హేమావతి, శానిటేషన్ సూపర్‌వైజర్ వెంకటరమణ, శానిటేషన్ అధికారి గోపి సూచనలతో అవుట్ సోర్సింగ్ సూపర్‌వైజర్ దమ్ము శ్రీనివాసరావు సిబ్బందితో కలిసి గెడ్డలలో చెట్లు తొలగించి నీటి ప్రవాహానికి ఆటంకం లేకుండాచేశారు.

మహిళా న్యాయవాదులు ఉన్నత శిఖరాలు చేరుకోవాలి

జస్టిస్ రవినాథ్ తిల్హారీ



మాట్లాడుతున్న రవినాథ్ తిల్హారి

ప్రజాశక్తి- లీగల్: న్యాయవాద వృత్తిలో మహిళలు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలంటే పట్టుదల, కృషి, సాంకేతిక పరిజ్ఞానాన్ని అలవర్చుకోవాలని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి రవినాథ్ తిల్హారీ అన్నారు. వివిఎంఆర్‌డిఎ చిల్డ్రన్స్ ఎరినాలో ఉమెన్స్ అడ్వకేట్ వెల్ఫేర్ అసోసియేషన్ ఏర్పాటు చేసిన సెమినార్ ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ప్రస్తుత సాంకేతిక యుగంలో అత్యున్నత న్యాయస్థానాల తీర్పులను అవలోకన చేసి, కేసుల విచారణలో ఉపయోగించుకుని కక్షిదారులకు న్యాయం చేస్తూ మహిళలు న్యాయవాద వృత్తిలో నిలదొక్కుకోవాలన్నారు. వివా లోగోను ప్రారంభించారు. కొత్తగా ఏర్పాటు చేసిన ఈ అసోసియేషన్ కార్యక్రమానికి మరో హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చీమలపట్టి రవి మాట్లాడుతూ, వివా సభ్యుల కృషితో ఏర్పడిన ఈ అసోసియేషన్ మహిళా న్యాయవాదుల సమస్యలపై గళం విప్పి, వారి అభివృద్ధికి తోడ్పాటు ఇవ్వాలని సూచించారు. తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గిరిజ ప్రియదర్శిని మాట్లాడుతూ, అన్ని రంగాల్లో మహిళలు సాధికారత సాధించాలన్నారు. ఉమెన్స్ అడ్వకేట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ పప్పు అనురాధ మాట్లాడుతూ, సంఘం విధి విధానాలను సభికులకు వివరించారు. ఈ కార్యక్రమంలో విశాఖపట్నం న్యాయవాదుల సంఘం అధ్యక్ష కార్యదర్శులు బెవర సత్యనారాయణ, దంతా నరేష్ కుమార్, ఆంధ్రప్రదేశ్ కౌన్సిల్ వైస్ చైర్మన్ ఎస్.కృష్ణమోహన్, సభ్యులు కె.రామ జోగేశ్వరరావు, పి.నర్సింగరావు, బైపా అరుణ్‌కుమార్, వివా ప్రధాన కార్యదర్శి హేమామాలిని, పద్మజ, శారద పాల్గొన్నారు.



రమేష్‌ను సన్మానిస్తున్న జివిఎంసి ఉద్యోగులు

రమేష్‌కు సన్మానం

ప్రజాశక్తి-సీతమ్మధార: జివిఎంసి జోన్ -3 అసిస్టెంట్ కమిషనర్‌గా విధులు నిర్వహించి విరమణ పొందిన పి.రమేష్‌ను ఉద్యోగస్తులు జోనల్ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పి.రమేష్ మాట్లాడుతూ, ఉద్యోగం నిర్వహణలో తన తోటి ఉద్యోగుల సహకారం మరువలేనిదన్నారు. తన కుటుంబీకులు సహాయ సహకారాలు అందించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జివిఎంసి జోన్ -3 పలు విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

చెరువులను తలపిస్తున్న రహదారులు



ఆనందపురం- పెందుర్తి రహదారిలో వర్షపు నీరు

ప్రజాశక్తి-యంత్రాంగం

ఇటీవల కురుస్తున్న వర్షాలకు రోడ్లు చెరువులను తలపిస్తున్నాయి. గెడ్డలు, వాగులు పొంగి పొర్లుతున్నాయి.

ఆనందపురం : ఆనందపురం- పెందుర్తి రహదారిలో వర్షం నీరు రహదారిపై చేరి చెరువులను తలపించే విధంగా తయారైంది. ఆనందపురం పెందుర్తి రహదారిలో దుక్కవాణిపాలెం, మిందివానిపాలెం వద్ద నీరు పోవడానికి మార్గం లేక రోడ్డుపై సుమారు 4 అడుగుల ఎత్తులో నీరు చేరింది. వాహనదారులు అతి కష్టం మీద ప్రయాణాలు సాగించారు. గెడ్డలను కబ్జాలు చేస్తుండటంతో నీరు పోవడానికి మార్గం లేక రోడ్లపైకి వచ్చి చేరుతోంది.

పద్మనాభం : మండలంలోని పద్మనాభం - రెడ్డిపల్లి రోడ్డు చెరువును తలపిస్తోంది. రోడ్డు మధ్యలో గుంతల్లో వర్షపు నీరు నిండింది. విజయనగరం -సింహాచలం ప్రధాన రోడ్డు కావడంతో ఎక్కువగా వాహనాలు తిరుగుతుంటాయి. సుమారు నాలుగు కిలోమీటర్ల రహదారి అధ్వానంగా ఉంది.

పెందుర్తి : 96వ వార్డు పరిధి పెందుర్తి కూడలి సమీపంలో బిఆర్‌టిఎస్ రోడ్డంతా జలమయమైంది. పూర్తిగా జలమయం కావడంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. బిఆర్‌టిఎస్ రోడ్డు పనులు పూర్తి కాకపోవడంతో ఎక్కడి నీరు అక్కడే నిల్వ చేరుతోంది. నరవ నుంచి సబ్బవరం వెళ్లే రోడ్డులో జెర్రిపోతుల పాలెం వద్ద రోడ్డంతా బురదమయంగా మారింది.

ములగాడ : జివిఎంసి 40వ వార్డు పరిధి ఎకెసి కాలనీ కూడలి వద్ద ప్రధాన రహదారి కల్వర్ట్‌లో పూడికలు పేరుకు పోవడంతో వర్షపు నీరు, మురుగు నీరు రహదారిపైకి చేరుతోంది. మల్కాపురం పోలీస్‌స్టేషన్‌లోకి, ఎకెసి.కాలనీ నివాస గృహాల్లోకి నీరు చేరింది. స్థానిక కార్పొరేటర్ డాక్టర్ గుండపు నాగేశ్వరరావు శనివారం ఆయా ప్రాంతాల్లో పర్యటించి పారిశుధ్య సిబ్బందితో పూడికలను తొలగించే ప్రయత్నంచేశారు.



పెందుర్తి రహదారిలో రోడ్డుపై ప్రవహిస్తున్న వర్షపు నీరు

కూలిన రిటర్నింగ్ వాల్‌ను పరిశీలించిన పివి.సురేష్

ప్రజాశక్తి-ములగాడ : రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు జివిఎంసి 60వ వార్డు పరిధి జనతాకాలనీలో కూలిన రిటర్నింగ్ వాల్ ప్రాంతాన్ని కార్పొరేటర్ పివి సురేష్ పరిశీలించారు. కొండచరియలు పడి కిందనే ఉన్న చర్చి పూర్తిగా ధ్వంసం కావడం, కొండ ప్రాంతానికి మంచి నీటి సరఫరా అయ్యే పైపులైను కూడా పూర్తిగా దెబ్బతినడాన్ని గమనించారు. త్వరితగతిన మరమ్మత్తుపనులు పూర్తి చేసి ప్రజలకు తాగునీటి ఇబ్బంది తలెత్తకుండా చూడాలని అధికారులను సురేష్ కోరారు. సురేష్ వెంట నాయకులు జివిఎల్ నరేష్, జగ్గ అప్పారావు, వర్క్ ఇన్‌స్పెక్టర్ రమేష్ తదితరులు ఉన్నారు.

డోలీమోతతో బాలింత తరలింపు

రహదారి లేక రామన్నపాలెం గిరిజనుల అవస్థలు

ప్రజాశక్తి-దేవరాపల్లి

మండలంలోని వాలాబు పంచాయతీ శివారు రామన్నపాలెం గ్రామానికి రహదారి సౌకర్యం లేకపోవడంతో సిజేరియన్ డెలివరీ జరిగిన బాలింతను డోలీమోతతో రెండు కిలోమీటర్ల మేర వర్షంలోనే మోసుకుంటూ గ్రామానికి తీసుకెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. రామన్నపాలెం గ్రామానికి చెందిన తామర్ల లక్ష్మిని డెలివరీ నిమిత్తం ఇటీవల విశాఖ కెజిహెచ్‌కు తీసుకెళ్లారు. నార్మల్ డెలివరీకి అవకాశం లేకపోవడంతో కెజిహెచ్ వైద్యులు పెద్ద ఆపరేషన్ చేసి బిడ్డను బయటకు తీశారు. తల్లీబిడ్డలను వారం రోజుల పాటు ఆసుపత్రిలో వైద్యుల పర్యవేక్షణలో ఉంచి శనివారం డిశ్చార్జి చేశారు. బాలింతను, పసికందును విశాఖపట్నం కెజిహెచ్ నుండి తల్లీబిడ్డ అంబులెన్స్‌లో వాలాబు మెయిన్ రోడ్డు వరకు తీసుకొచ్చారు. అక్కడ నుండి రామన్నపాలెం గ్రామానికి రహదారి సౌకర్యం లేకపోవడంతో అంబులెన్స్ వెళ్లే అవకాశం లేక వాలాబు మెయిన్ రోడ్డులో వారిని దించేశారు. దీంతో బంధువులు డోలికట్టి సిజేరియన్ జరిగిన బాలింతను, పసికందును వర్షంలో గొడుగులు వేసుకొని మోసుకుంటూ రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న రామన్నపాలెం గ్రామానికి తీసుకెళ్లారు.

రహదారి సౌకర్యం కల్పించాలి : సిపిఎం

విషయం తెలుసుకున్న సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి.వెంకన్న, మండల కార్యదర్శి బిటి.దొర అక్కడకు చేరుకొని బాధిత గిరిజనులను పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేవరాపల్లి మండల కేంద్రానికి కేవలం ఏడు కిలో మీటర్ల దూరంలో ఉన్న కోడాపల్లి, రామన్నపాలెం గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పించకపోవడం దారుణమన్నారు. ఈ గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పించాలని ప్రజాప్రతినిధులకు, జిల్లా కలెక్టర్‌కు, అధికారులకు అనేకసార్లు మొరపెట్టుకున్నా ఏ ఒక్కరూ స్పందించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. స్వాతంత్ర్య వచ్చి 78 ఏళ్ళు గడుస్తున్నా మండల కేంద్రం దగ్గరిలో ఉన్న గ్రామాలకు కూడా కనీసం రహదారుల సౌకర్యం కల్పించకపోవడం సిగ్గు చేటన్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి వెంటనే గిరిజన గ్రామాలకు రోడ్డు సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. వీరి వెంట డి.శంకర్, చేదల ఎరకయ్య, గ్రామగిరిజనులు ఉన్నారు.



డోలు కట్టి బాలింతను మోసుకొస్తున్న బంధువులు



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ విజయ కృష్ణన్

వర్షాల నేపథ్యంలో కంట్రోల్ రూమ్స్ ఏర్పాటు

ప్రజాశక్తి-అనకాపల్లి

జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల దృశ్య జిల్లాలో కమెండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ తెలిపారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంతో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌ను శనివారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కలెక్టరేట్‌తో పాటు అనకాపల్లి, నర్సీపట్నం రెవెన్యూ డివిజినల్ అధికారి కార్యాలయాలలోనూ ఈ కమెండ్ కంట్రోల్ రూమ్స్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ప్రజలు కమాండ్ కంట్రోల్ రూమ్ ఫోన్ నెంబర్ల ద్వారా సహాయం పొందవచ్చని పేర్కొన్నారు. కలెక్టర్ కార్యాలయం కమెండ్ కంట్రోల్ రూమ్ ఫోన్ నెంబర్లు : 08924-226599, 08924-222888, అనకాపల్లి ఆర్‌డిఓ కార్యాలయం కంట్రోల్ రూమ్ ఫోన్ నెంబర్ : 9491998293, నర్సీపట్నం ఆర్‌డిఓ కార్యాలయం కంట్రోల్ రూమ్ ఫోన్ నెంబర్ : 7075356563. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం జాహ్నవి, జిల్లా రెవెన్యూ అధికారి బి.దయానిధి, వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

రానున్న మూడు రోజులు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-దేవరాపల్లి

అల్పపీడనం ప్రభావంతో రానున్న మూడు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అనకాపల్లి ఆర్డీవో ఎ.చిన్నికృష్ణ పేర్కొన్నారు. భారీ నుంచి అతి భారీ వర్షాలు కురవచ్చని వాతావరణ శాఖ వెల్లడించడంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ ఆదేశాల మేరకు శనివారం రైవాడ జలాశయాన్ని ఆర్‌డిఓ చిన్నకృష్ణ పరిశీలించారు. జలాశయం ఏఈ డి.నరేష్‌తో మాట్లాడి రిజర్వాయర్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆర్డీవో చిన్నికృష్ణ మాట్లాడుతూ తుఫాన్ ప్రభావం కారణంగా మండల స్థాయి, గ్రామస్థాయి అధికారులంతా స్థానికంగా ఉండాలని ఆదేశించారు. ప్రమాదకరంగా ఉన్న చెరువుగట్టులను గుర్తించి యుద్ధ ప్రాతిపదికంగా మరమ్మతు చర్యలు చేపట్టాలని సూచించారు. ఆయన వెంట రెవిన్యూ అధికారులు సతీష్, నాగేశ్వరరావు ఉన్నారు.

'ఎసెన్షియా' మృతునికి నివాళి

ప్రజాశక్తి అచ్యుతాపురం : ఎసెన్షియా కంపెనీలో ఇటీవల జరిగిన ప్రమాదంలో మృతి చెందిన పూడి మోహన్ దుర్గాప్రసాద్ చిత్రపటానికి ఎస్ఈజెడ్ మోటూరుపాలెం కాలనీలో దుర్గాప్రసాద్ ఇంటి వద్ద సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్.రాము శనివారం పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకటించిన కోటి రూపాయలు పరిహారం వెంటనే నగదు రూపంలో చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ప్రకటించిన కోటి రూపాయలు నేటికీ కుటుంబానికి అందలేదన్నారు. పరిహారం పంపిణీలో ప్రభుత్వ పన్నులు లేకుండా చెల్లించే ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సంతాప కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి కె సోమునాయుడు, నాయకులు గోపాల్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో రైతులకు లాభం

ప్రజాశక్తి-అనకాపల్లి : ప్రకృతి వ్యవసాయ విధానం ద్వారా రైతులకు లాభం చేకూరుతుందని ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ లచ్చన్న, ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త రామలక్ష్మి పేర్కొన్నారు. ప్రకృతి వ్యవసాయ విధానం చేస్తున్న దిబ్బపాలెం, సీతానగరం, వెంకుపాలెం రైతుల క్షేత్రాలను శనివారం పరిశీలించారు. విత్తనాలు వేసిన దగ్గర నుంచి పంట కోసే వరకు అమలు చేస్తున్న సీఎన్ఎఫ్ పద్ధతులు, సీసీ ఎక్స్పరిమెంట్స్, బయోమెట్రిక్ చేయు విధానంపై నివేదిక తయారుచేసి ప్రభుత్వానికి పంపడం జరుగుతుందని డిపిఎం లచ్చన్న తెలిపారు. కార్యక్రమంలో రైతులు ఎల్లపు అప్పల నరసమ్మ, బుద్ధ అచ్చియమ్మ, బుద్ధ సత్యవతి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

'ఎసెన్షియా' మృతుల కుటుంబాలకు వైసిపి ఆర్థిక సాయం అందజేత



ఆర్థిక సాయం అందిస్తున్న ఎమ్మెల్సీ బొత్స, అమర్‌నాథ్, కన్నబాబురాజు తదితరులు

ప్రజాశక్తి-అచ్యుతాపురం

అచ్యుతాపురం ఎస్ఇజెడ్‌లోని ఎసెన్షియా పరిశ్రమలో జరిగిన ప్రమాదంలో మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు శనివారం స్థానిక సంస్థల ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ, మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్, మాజీ ఎమ్మెల్యేలు కన్నబాబురాజు, ధర్మశ్రీ తదితరులు చేతుల మీదుగా వైసిపి ప్రకటించిన ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఎసెన్షియా ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులను పరామర్శించడానికి మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి అనకాపల్లి విచ్చేసిన సందర్భంగా మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందజేస్తామని ప్రకటించిన విషయం విధితమే. ఈ మేరకు ఎస్ఇజెడ్ మోటూరు పాలెం, వాసెట్టిపాలెం, మూలజంప గ్రామాలలో మృతులు పూడి మోహన్ దుర్గాప్రసాద్ తల్లిదండ్రులకు, వై.చిన్నారావు భార్యకు, వేగి సన్యాసినాయుడు కుటుంబీకులకు రూ.5 లక్షల చొప్పున ఆర్థిక సహాయాన్ని చెక్కుల రూపంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి జిల్లా అధ్యక్షులు బొడ్డేడ ప్రసాద్, అచ్యుతాపురం మండల శాఖ అధ్యక్షులు దేశంశెట్టి శంకర్రావు, జడ్పిటిసి సభ్యుడు లాలం రాంబాబు, నర్మల్ కుమార్, కోన బుజ్జి, పి.వాసురాజు తదితరులు పాల్గొన్నారు.

బిఎన్ రోడ్డు బురదమయం

- బుదిరెడ్లపాలెం వద్ద దిగబడిపోయిన భారీ లారీ
- నరకయాతన అనుభవిస్తున్న వాహనదారులు
- పట్టించుకోని ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు



బురదమయంగా ఉన్న బిఎన్ రహదారి

ప్రజాశక్తి-వడ్డాది, బుచ్చయ్యపేట

భీమిలి-నర్సీపట్నం (బిఎన్) రోడ్డు బుచ్చయ్యపేట మండలంలో బురదమయంగా తయారైంది. ప్రధానంగా మండలంలోని బుదిరెడ్లపాలెం, పొట్టిదొరపాలెం, లోపూడి, వడ్డాది, విజయరామరాజుపేట తదితర గ్రామాల వద్ద ఈ రహదారి అస్తవ్యస్తంగా ఉంది. చోడవరం నుండి నర్సీపట్నం వెళ్లే ఈ మార్గంలో బుచ్చయ్యపేట మండలం విజయరామరాజుపేట నుండి అటు రావికమతం మండలం కొత్తకోట వరకు ఈ రహదారిలో పెద్ద పెద్ద గోతులు ఏర్పడ్డాయి. గత ప్రభుత్వ హయాంలో ఈ రహదారికి మరమ్మతులు చేయడంగాని, పునర్నిర్మాణంగాని చేపట్టలేదు. ఈ ఏడాది జూన్‌లో ఏర్పడిన టిడిపి కూటమి ప్రభుత్వం కూడా ఈ రహదారిపై దృష్టి పెట్టలేదు. ఈ రహదారి దుస్థితిపై పలు పత్రికల్లో వార్తలు రావడం, తీవ్ర ఇబ్బందులు పడుతున్న వాహనదారులు, ప్రయాణికుల నుండి విమర్శలు వెల్లువెత్తడంతో బుచ్చయ్యపేట మండలంలోని బుదిరెడ్లపాలెం, పొట్టిదొరపాలెం, లోపూడి, సింగవరం, బంగారుమెట్ట, వడ్డాది, విజయరామరాజుపేట తదితర గ్రామాల వద్ద స్థానిక నాయకులు పొలంలో మట్టితో ఆ గోతులను పూడ్చారు. అయితే కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాల వల్ల గోతులను మట్టితో పూడ్చిన ప్రాంతాల్లో రహదారి అస్తవ్యస్తంగా తయారైంది. వాహనాల రాకపోకల వల్ల రోడ్డు మొత్తం దమ్ముదుక్కు దున్నిన మడుల వలే బురదమయంగా మారింది. దీంతో ద్విచక్ర వాహనాల దారులు జారి పడిపోతున్నారు. భారీ వాహనాలు దిగబడిపోతున్నాయి. శనివారం బుదిరెడ్లపాలెం వద్ద భారీ లారీ బురదలో కూరుకుపోయింది. మరో వైపు వాహనాల రాకపోకల వల్ల మట్టి పూడ్చిన ప్రాంతాల్లో మళ్లీ గోతులు ఏర్పడి వర్షపు నీరు చేరడంతో పంట పొలాల్లో నూతులు వలె తయారయ్యాయి. ఈ రోడ్డులో ప్రయాణించే ప్రతి ఒక్కరూ ప్రభుత్వాన్ని తిట్టుకుంటూనే వెళ్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు స్పందించి బిఎన్ రోడ్డును పునర్నిర్మాణం చేయాలని కోరుతున్నారు.



బుదిరెడ్ల పాలెం వద్ద దిగబడిపోయిన భారీ లారీ

నేలకూలిన వందేళ్ల నాటి చింత చెట్టు

ప్రజాశక్తి-వడ్డాది

తుఫాను ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాలకు బుచ్చయ్యపేట మండలం బంగారుమెట్ట గ్రామంలో బిఎన్ రోడ్డుకు ఆనుకొని ఉన్న వందేళ్ల నాటి చింతచెట్టు శనివారం ఉదయం నెలకూలింది. ఈ చెట్టు రెడ్డి వరలక్ష్మి ఇంటి గోడపై పడడంతో ఇల్లు కొంత భాగం ధ్వంసమైంది. స్థానిక శరాబుల వీధిలో ఉన్న ఈ చింతచెట్టు వయస్సు 100 సంవత్సరాలు పైబడి ఉంటుందని గ్రామస్తులు తెలిపారు. ఇన్నాళ్ళ నీడనిచ్చిన చింత చెట్టు కూలిపోవడం స్థానికులను కలచివేసింది. రోడ్డుకు ఆనుకొని ఉన్న ఈ చెట్టు రోడ్డు పైకి కాకుండా పక్కన ఉన్న ఇంటిపై పడడంతో స్వల్ప నష్టమే జరిగింది.



కూలిపోయిన చింతచెట్టు

విద్యార్థిని పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన
అసిస్టెంట్ ప్రొఫెసర్‌ను కఠినంగా శిక్షించాలి : ఎస్‌ఎఫ్‌ఐ

ప్రజాశక్తి-అనకాపల్లి

ఏడాది కాలంగా విద్యార్థిని పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తూ ఇబ్బంది పెడుతున్న దాడి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ టెక్నాలజీ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ మురళిని కఠినంగా శిక్షించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా సెక్రటరీ రమణ డిమాండ్ చేశారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థినులను పక్కకు పిలిచి ముద్దులు అడుగుతూ, అసభ్యంగా మాట్లాడుతూ ఇబ్బంది పెట్టడం సరికాదన్నారు. ఏడాదిగా అమ్మాయిని ఇబ్బంది పెడుతూ, బయటికి చెబితే చదవట్లేదని ఇతర కారణాల ద్వారా వారిని భయపెడుతూ, తల్లిదండ్రులకు చెప్తానని బెదిరిస్తున్న వేధింపులకు గురి చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. చదువు చెప్పే అధ్యాపకుడు ఇలా వ్యవహరిస్తే అమ్మాయిలు ఎలా చదువుకుంటారని ప్రశ్నించారు. సమాజంలో ఎన్నో అత్యాచారాలు జరుగుతున్నా ఉపాధ్యాయులు ధైర్యం చెప్పాల్సిన పోయి ఉపాధ్యాయుడు తప్పు చేస్తే విద్యార్థులకు నచ్చ చెప్పేవాడు ఎవరని ప్రశ్నించారు. ఇప్పటికైనా సదరు అధ్యాపకునిపై కఠినమైన చర్యలు తీసుకోవాలని, ఇలాంటి సంఘటన పునరావృత్తం కాకుండా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు అర్జున్, శివాజీ పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటుదాం


ప్రజాశక్తి-కె.కోటపాడు : పర్యావరణ పరిరక్షించుకునేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటాలని ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారి మంగతాయారు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన 'తల్లి పేరు మీద ఒక చెట్టు రేపటి కోసం' కార్యక్రమంలో భాగంగా స్థానిక ఐసిడిఎస్ కేంద్రం పరిధిలో శనివారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని ప్రతి అంగన్వాడి కేంద్రాలు పరిధిలో ప్రతి ఒక్క తల్లితో మొక్కలు నాటించాలని కార్యకర్తలకు సూచించారు. కే కోటపాడు సెక్టర్ పరిధిలో దేవరపల్లి కోటపాడు మండలంలో గల అన్ని అంగన్వాడి కేంద్రాల్లో మొక్కలు నాటించి వాటి సంరక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్లు సుశీల, రాము, కళ్యాణి, కార్యకర్తలు, కుమారి, లక్ష్మి, చెల్లయమ్మ, ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

గంబూసియా చేప పిల్లలు విడుదల

ప్రజాశక్తి-పరవాడ : మండలంలోని తానాం గ్రామ పంచాయతీ పరిధిలోని మురుగు కాలువలు, నీరు నిల్వ ఉండే ప్రాంతాల్లో దోమలు పెరగకుండా ఉండుటకు, దోమలు నివారణ కొరకు గంబూసియా చేప పిల్లలను విడుదల చేశారు. కార్యక్రమంలో అనకాపల్లి మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కన్నూరు వెంకటరమణ, మాజీ జడ్పిటిసి పైల జగన్నాధరావు, ఉపసర్పంచ్ వర్రి వసంతరావు వరలక్ష్మి, వార్డ్ మెంబర్లు రోగల అప్పారావు, రొంగల సన్యాసిరావు, సచివాలయం ఏఎన్ఎం, ఆశా కార్యకర్త, తదితరులు పాల్గొన్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-కె.కోటపాడు : గత రెండు రోజుల నుండి కురుస్తున్న వర్షాలు రైతులకు ఎంతో ఉపయోగకరమని, వరి పొలాల్లో పుష్కలంగా నీరు చేరిందని వ్యవసాయ సహాయ సంచాలకులు వి.రవీంద్ర అన్నారు. శనివారం మండలంలోని వారాడ, వి సంతపాలెం గ్రామాల్లో వరి పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు ఎటువంటి పంట నష్టం లేదని, పంటపొలాలు బాగున్నాయని, ఇకపై అధిక వర్షాలు కురిస్తే రైతులు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. పల్లపు ప్రాంతాల్లో ఉన్న వరి పంటలో వర్షపు నీరు నిలువ ఉండకుండా చిన్నచిన్న నీటి కాలువలు తీసుకుని అదనపు నీటిని బయటకు పంపాలన్నారు. అధిక వర్షాల వల్ల ఎక్కడైనా పంట నష్టం సంభవిస్తే గ్రామ వ్యవసాయ సహాయకులకు తెలియజేయాలని సూచించారు. వ్యవసాయ సిబ్బంది రైతులకు అందుబాటులో ఉండాలని ఆదేశించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి సోమశేఖర్, స్నేహ, విజయ్ పాల్గొన్నారు.



వరి పొలాలను పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

గంజాయి నిందితుల అరెస్టుకు ప్రత్యేక బృందాలు

జిల్లా ఎస్‌పి దీపిక

ప్రజాశక్తి-అనకాపల్లి

గంజాయి అక్రమ రవాణా కేసుల్లో నిందితులుగా ఉండి తప్పించుకుని తిరుగుతున్న వారిని అరెస్టు చేయడానికి ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్‌పి ఎం.దీపిక పేర్కొన్నారు. ఇప్పటికే కొంతమంది నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కి తరలించినట్లు తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ అధ్యక్షతన శనివారం నెలవారీ నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. దర్యాప్తులో ఉన్న సాధారణ, తీవ్రమైన, ముఖ్యమైన కేసులు, ప్రాపర్టీ కేసులు, 174 సీఆర్‌పిసి, గంజాయి, మిస్సింగ్ కేసులను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సమీక్షించారు. ఆయా కేసుల్లో దర్యాప్తు పెండింగ్‌లో ఉండడానికి గల కారణాలను సంబంధిత అధికారుల నుండి తెలుసుకున్నారు. త్వరితగతిన దర్యాప్తు చేయుటకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ నేషనల్ హైవే, ఇతర రోడ్డులలో ప్రమాదాల నివారించేందుకు నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా వారితో మాట్లాడి అక్రమ మీడియన్‌లను మూయించడం, స్టాపర్ బోర్డులు, బ్లింకర్స్ ఏర్పాటు చేయడం చేయాలని ఆదేశించారు. మైనర్స్ వాహనాల నడిపి ప్రమాదాలు గురవుతున్న సందర్భంగా వాహనాలు సీజ్ చేసి వారి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ చేసి కేసులు నమోదు చేయాలని సూచించారు. పెండింగ్ కేసులలో దర్యాప్తును పూర్తి చేసి అభియోగ పత్రాలను కోర్టులో సమర్పించి యూ.ఐ కేసులను తగ్గించేందుకు తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో ప్రతిభ కనబరిచిన 22 మంది పోలీసు అధికారులు, సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ ఎం.దేవ ప్రసాద్, ఎస్‌బి డీఎస్పీ బి.అప్పారావు, పరవాడ సబ్ డివిజన్ డీఎస్పీ కె.వి.సత్యనారాయణ, నర్సీపట్నం సబ్ డివిజన్ డీఎస్పీ జీఆర్ఆర్.మోహన్, దిశ డీఎస్పీ ఎం.ఉపేంద్ర బాబు, ఏఆర్ డీఎస్పీ పి.నాగేశ్వరరావు, ఇన్‌స్పెక్టర్లు ఎస్.లక్ష్మణమూర్తి, కె.లక్ష్మణమూర్తి, చంద్రశేఖర్, గణేష్, మన్మధరావు, నరసింహమూర్తి, సంజీవరావు, ఎస్సైలు నాగ కార్తీక్, రఘువర్మ, జిల్లా సీఐలు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న ఎస్‌పి దీపిక, పోలీసు అధికారులు

ఉద్యోగ విరమణ వీడ్కోలు సత్కారం



ఉద్యోగ విరమణ చేసిన కొట్నాల చిట్టిబాబు దంపతులను సత్కరిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-కశింకోట

మండల విద్యాశాఖ అధికారి-1 కొట్నాల చిట్టిబాబు ఉద్యోగ విరమణ సందర్భంగా శనివారం కసింకోట ఫంక్షన్ హాల్‌లో కసింకోట మండల ఉపాధ్యాయ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో అభినందన సభ నిర్వహించి ఘనంగా సత్కరించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ మాట్లాడుతూ చిట్టిబాబు విధి నిర్వహణలో నిబద్ధతగా, ఆదర్శప్రాయంగా తన విధులు నిర్వహించారని తెలిపారు. అనంతరం ఎంఈఓ చిట్టిబాబు దంపతులకు గజమాలవేసి సాలువ కప్పి జ్ఞాపక అందజేసి ఘనంగా సత్కరించారు. కసింకోట ఎంఈఓ-2 కేఎస్ఎన్ మూర్తి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ జేఏసీ సభ్యులు పాల్గొన్నారు.

అనకాపల్లి : అనకాపల్లి మండల విద్యాశాఖ అధికారి చిట్టిబాబు రిటైర్మెంట్ ఫంక్షన్ అనకాపల్లి మండల, జీవీఎంసీ, ఎయిడెడ్ ప్రైమరీ, ఉపాధ్యాయ సమాఖ్య ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. అనకాపల్లి శాసన సభ్యులు కొణతాల రామకృష్ణ పాల్గొని చిట్టి బాబుని సత్కరించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ సమాజంలో ఉపాధ్యాయులకు ఒక ప్రత్యేక స్థానం ఉందని, భావి తరాలకు ఆదర్శంగా ఉండే టీచర్స్‌కి ఎప్పుడు గౌరవం ఉంటుందని తెలిపారు. ఎంఈఓ-2కోటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఏపీటీఎఫ్ అనకాపల్లి మండల అధ్యక్షులు కెవి గణేష్, పిఆర్‌టియు అధ్యక్షులు ఆనంద్, ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షులు పల్లా బాబ్జి, ఎమ్ఏపి హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు లావణ్య, కిరీటి, నూకేష్, ఉమా మహేశ్వరరావు, జి.అప్పారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మత్స్యకారుల సమస్యలపై బహిరంగ చర్చ

ప్రజాశక్తి- సబ్బవరం : మండలంలోని దామోదరం సంజీవయ్య న్యాయ విశ్వవిద్యాలయం, జాతీయ మానవ హక్కుల కమిషన్ సంయుక్తంగా రైట్స్ ఆఫ్ ఫిషర్‌మెన్ అనే అంశం' అధ్యాపకులు, మత్స్యకారులు, వారి ప్రతినిధులతో శనివారం బహిరంగ చర్చ నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య డి.సూర్యప్రకాశరావు మాట్లాడుతూ మానవ హక్కులలో భాగంగా మత్స్యకారుల హక్కులను గుర్తి అవగాహన కల్పించడం కోసం ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. వర్సిటీలో మానవ హక్కుల సెంటర్‌ను ఏర్పాటు చేశామని, దీని ద్వారా ఇకపై అనేక అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన జాతీయ మానవ హక్కుల కమిషన్ యాక్టింగ్ ఛైర్‌పర్సన్ విజయ భారతి సయాని మాట్లాడుతూ సమాజంలో వివిధ వర్గాల హక్కుల పరిరక్షణ కొరకు హక్కుల కమిషన్ పాటు పడుతుందన్నారు. అందులో భాగంగా దేశంలోని వివిధ ప్రాంతాలలో ఓపెన్ హౌస్ డిస్కషన్ ఏర్పాటు చేసి ఆయా వర్గాల వారు ఎలా హక్కులను వినియోగించుకుంటున్నారో, వారు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకొనేందుకు ఈ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. అనంతరం కార్యక్రమంలో వివిధ మత్స్యకార సంఘాల ప్రతినిధులతో ఛైర్‌పర్సన్ బహిరంగ చర్చలు నిర్వహించి మత్స్యకారులు ఎదుర్కొంటున్న వాస్తవిక సమస్యలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమములో ఫిషరీస్ డిపార్ట్‌మెంట్ కమిషనర్, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ విశ్వచంద్రనాథ్ మాదాసు, సెంటర్ ఫర్ హ్యూమన్ రైట్స్ కన్వీనర్ డాక్టర్ కే.సుధ, టివై నిర్మల దేవి,అకాడమిక్ డైరెక్టర్ సోమా భట్టాచార్య, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మంత్రి లోకేష్‌కు సమస్యలపై వినతులు



లోకేష్‌ను కలిసిన 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్

ప్రజాశక్తి- విలేకర్ల బృందం

ఎపి విద్య, ఐటి శాఖా మంత్రి నారా లోకేష్‌ను విశాఖపట్నంలోని టిడిపి కార్యాలయంలో పలువురు ప్రజాప్రతినిధులు, టిడిపి నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తమ ప్రాంతంలోని సమస్యలపై వినతిపత్రాలు అందించారు.


పరవాడ : జివిఎంసి 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ మంత్రి నారా లోకేష్‌ను కలిసి తమ వార్డు పరిధిలోని పరిసర గ్రామాల సమస్యలపై వినతి పత్రం అందజేశారు. లంకెలపాలెం పరిసర ప్రాంతాల్లో అన్నా క్యాంటిన్ ఏర్పాటు చేయాలని, కళ్యాణ మండపం నిర్మించాలని, ఫార్మాసిటీలో పొల్యూషన్, సేఫ్టీ ఆఫీసును ఏర్పాటు చేయాలని, నిర్వాసితులకు ఫార్మాసిటీ కంపెనీల్లో ఉద్యోగాలు కల్పించాలని, ఇంకా పలు సమస్యలపై విన్నవించారు.

రాష్ట్ర పంచాయతీ రాజ్ చాంబర్ ఉపాధ్యక్షులు, రాష్ట్ర మత్స్యకార సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి చింతకాయల ముత్యాలు సర్పంచ్‌ల సంఘం నాయకులతో కలిసి శనివారం మంత్రి నారా లోకేష్‌ని కలిసి పంచాయతీ నిధులు విడుదల చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. మంత్రి నారా లోకేష్‌ను పరవాడ మండలం టిడిపి అధ్యక్షులు వియ్యపు చిన్నా మర్యాద పూర్వకంగా కలిసి స్థానిక సమస్యలు వివరించారు.

అనకాపల్లి : జీవీఎంసీ 80వ వార్డు కార్పొరేటర్ కొణతాల నీలిమ భాస్కరరావు శనివారం మంత్రి నారా లోకేష్‌ను కలిసి తమ వార్డు సమస్యలు వివరించారు. అలాగే అన్నపూర్ణ పిఏసిఎస్ మాజీ అధ్యక్షులు, తుమ్మపాల మాజీ సర్పంచ్ కర్రి వెంకట సన్యాసినాయుడు (బాబి) లోకేష్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

కశింకోట : మంత్రి నారా లోకేష్‌ను మండలంలోని అచ్చెర్ల గ్రామ టీడీపీ అధ్యక్షులు నైనముశెట్టి రమణరావు, తాళ్ళపాలెం గ్రామ టీడీపి అధ్యక్షులు ఉల్లింగల రమేష్ మర్యాదపూర్వకంగా కలిశారు.

మధురవాడ : జివిఎంసి 7వ వార్డు అభివృద్ధికి సహకరించాలని కోరుతూ రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్‌కు వార్డు కార్పొరేటర్ పిళ్లా మంగమ్మ వినతిపత్రం అందించారు. వార్డులో మౌలిక వసతుల కల్పన, వార్డులోని ముఖ్య సమస్యలను లోకేష్‌కు వివరించారు. ఈ కార్యక్రమంలో పోతిన నాయుడు పాల్గొన్నారు.



మంత్రి లోకేష్‌కు వినతిపత్రం అందిస్తున్న చిట్టిబాబు

లీగల్ : మంత్రి నారా లోకేష్‌ను విశాఖపట్నం టిడిపి లీగల్ సెల్ అధ్యక్షులు భత్తి రాజశేఖర్ ఆధ్వర్యాన కూటమి న్యాయవాదులు మర్యాదపూర్వకంగా కలిశారు. న్యాయవాదుల సమస్యలను వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి లీగల్ సెల్ ప్రతినిధులు పి.ఎస్.నాయుడు, వెన్నెల ఈశ్వరరావు, సవిల సతీష్, కన్నూరు అప్పలనాయుడు పాల్గొన్నారు.

ములగాడ : సింథియా, గాంధీగ్రామ్, యారాడలో భూ సమస్య, గంగవరం పోర్టు కాలుష్యం, పర్యాటక సమస్యలపై మంత్రి నారా లోకేష్‌కు టిడిపి నాయకులు చిట్టిబాబు జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. దీనిపై లోకేష్ సానుకూలంగా స్పందించారని చిట్టిబాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు.

పలుచోట్ల ఎడతెరిపిలేని వర్షం

-కొండ చరియలు పడి ఇల్లు ధ్వంసం
- జలాశయాలకు భారీగా వరద నీరు

ప్రజాశక్తి- కోటవురట్ల:మండల వ్యాప్తంగా శనివారం ఉదయం నుంచి ఎడతెరిపిలేకుండా వర్షం కురుస్తుంది. దీంతో, కొన్ని ప్రాంతాలలో లోతట్టు ప్రాంతాలు జల మయమయ్యాయి. తహసిల్దారు జానకమ్మ నదీ పరివాహక ప్రాంతాలను పరిశీలించి సిబ్బందిని అప్రమత్తం చేశారు. వర్షాలకు రోడ్లన్నీ జలమయమయ్యాయి. పలుచోట్ల పంట పొలాలు నీట మునిగాయి.


ధ్వంసమైన ఇంటి వద్ద బాధితురాలు

-కొండ చర్యలు విరిగి ఇల్లు ధ్వంసం ఉలిక్కిపడ్డ పందూరు గ్రామస్తులు

కోటవురట్ల: పందూరు గ్రామంలో గడిచిన రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు గ్రామం సమీపంలో కొండరాయి విరిగిపడి ఇల్లు ధ్వంసం అయ్యింది. గ్రామంలో ఆర్.బి.కె సమీపంలో ఉన్న కొండ ప్రాంతంలో ఉన్న మామిడి లక్ష్మి అనే మహిళ ఇంటి వద్ద బండరాయి పడటంతో ఆమె భయాందోళనలకు గురైంది. ఇంట్లో సామాన్లు ధ్వంసం అయ్యాయి.గ్రామస్తులు అంతా ఉలిక్కిపడ్డారు. అధికారులు స్పందించి కొండను పరిశీలించాలని స్థానికులు కోరుతున్నారు.

నక్కపల్లి:మండలంలోని తుఫాన్ ప్రభావంతో శనివారం ఎడతెరిపి లేకుండా జోరు వాన కురిసింది. తెల్లవారుజాము నుంచి కురుస్తున్న వర్షానికి రోడ్లు, లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పల్లె గ్రామాల్లో రోడ్లు చిత్తడిగా దర్శనమిస్తున్నాయి. ఎడతెరిపి లేకుండా వర్షం కురవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ముఖ్యంగా ప్రయాణాలు సాగించేవారు వర్షంతో అవస్థలు పడ్డారు. తుఫాన్ ప్రభావంతో అధికారులు ప్రజలను అప్రమత్తం చేశారు. తీర ప్రాంతాల్లో మత్స్యకారులు వేటకు వెళ్లొద్దని హెచ్చరికలు జారీ చేశారు. పొలాల్లోకి వర్షపు నీరు వచ్చి చేరడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మిగిలి ఉన్న భూముల్లో ఉడుపులు సాగిస్తున్నారు. శనివారం 8 .30 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు 31.2 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదైనట్లు తహసిల్దార్ అంబేద్కర్ తెలిపారు. ప్రస్తుతానికి మండలంలో ఎటువంటి నష్టం జరగలేదన్నారు.

బుచ్చయ్యపేట :శుక్రవారం అర్ధరాత్రి నుండి ప్రారంభమైన భారీ వర్షం రోజంతా పడుతూనే ఉంది. దీంతో పలు గ్రామాల్లో రోడ్లన్నీ జలమయమయ్యాయి. బుచ్చయ్యపేట జంక్షన్ సమీపంలో రోడ్డు పై రెండు అడుగుల మేర వర్షపు నీరు నిలిచిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరో వైపు ఈ వర్షాలకు మండలంలోని పలు గ్రామాల్లో పంట పొలాల్లో భారీగా వర్షపు నీరు చేరింది. దీంతో మెట్ట ప్రాంతాల్లోని రైతులు వరినాట్లు పనులను ముమ్మరంగా చేస్తున్నారు.

కశింకోట : కశింకోట మండలంలో గత మూడు రోజులుగా వర్షాలు కురవడంతో పలు గ్రామాల్లో వీధులు జలమయమయ్యాయి. తాళ్ళపాలెం జంక్షన్ చెరువులా మారింది. నీరు పెద్ద మొత్తంలో నిలిచిపోవడంతో నర్సీపట్నం వైపు వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. చెరుకు, వరి పంటలు నీరు నిలిచిపోయింది.

జలాశయాలకు భారీగా వరద నీరు

నాతవరం: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా కురుస్తున్న వర్షాలకు రోజు రోజుకు తాండవ జలాశయం నీటిమట్టం పెరుగుతుంది. ఈ తాండవ జలాశయాన్ని ఆర్డీఓ జయరాం పరిశీలించారు. రిజర్వాయర్ డిఈ అనురాధ మాట్లాడుతూ, తాండవ జలాశయం పూర్తి స్థాయి నీటిమట్టం 380 కాగా ప్రస్తుతం 377.7 అడుగులు ఉందని తెలిపారు. వర్షాలు అధికంమైతే నీటిని విడుదల చేసే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. ప్రస్తుతానికి ఇన్ ఫ్లో 485 క్యూసెక్కులకు గాను అవుట్ ఫ్లో 365 క్యూసెక్కులుగా ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో డిటి సురేష్, ఆర్ ఐ హరికుమార్ పాల్గొన్నారు.

కొత్తకోట:కళ్యాణపులోవ వరహా జలాశయం పరి వాహక ప్రాంతంలో గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు జలాశయం నీటిమట్టం 459.00 అడుగుల ప్రమాద స్థాయికి చేరిందని జలాశయం ఏఈ సత్యనారాయణదొర శనివారం సాయంత్రం ఓ ప్రకటన లో తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు మేరకు... జలాశయం గరిష్ట స్థాయి నీటిమట్టం 460.00 అడుగు లు కాగా ప్రస్తుతం ఇన్ ఫ్లో సుమారు 115 క్యూ సెక్కుల వరద నీరు చేరుతోందని చెప్పారు. ముందుగా స్పిల్ వే రెండు గేట్లు ఎత్తి సుమారు 100 క్యూ సెక్కులు వరద నీటిని సర్పా నదిలోనికి విడుదల చేశామని, ఇన్ ఫ్లో పెరిగే కొద్ది మిగిలిన గేట్లు ద్వారా దిగువకు (నదిలోనికి) నీరును విడుదల చేయడం జరుగు తుందని పేర్కొన్నారు. సర్పానదీ పరీవా హక ప్రాంతంలో ఉన్న గ్రామ ప్రజలను అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఈ మేరకు రెవిన్యూ శాఖ అధికారులకు సమాచారం అందించామని ఏఈ సత్యనారాయణ దొర తెలిపారు...


ప్రవహిస్తున్న కల్యాణపులోవ జలాశయం

దోమల నివారణకు పటిష్ట చర్యలు

ప్రజాశక్తి - నాతవరం: మండల కేంద్రం, చమ్మచింత, ములగపూడి గ్రామాలలో నిలువ ఉన్న నీటి గుంతలు, కాలువలలో గంబుజియా చేప పిల్లలను వైద్య సిబ్బంది వేశారు. గంబుజియా ఫిష్‌తో దోమల లార్వాలను తినేస్తాయి. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ కాశవు ప్రసాద్ హెల్త్ అసిస్టెంట్లు అప్పలనాయుడు, అప్పాన ప్రసాద్, ఎంపిహెచ్ఓ రమణ, నరేంద్ర పాల్గొన్నారు.

గొలుగొండ:గొలుగొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి శ్యాంకుమార్ ఆధ్వర్యంలో కొత్తజోగుంపేట, కొత్తమల్లంపేట గ్రామాల్లో దోమలు నివారణ చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో భాగంగా చెరువులు గుంతలు, నీటి నిల్వ ఉన్న ప్రాంతాల్లో గంబూషియా చేప పిల్లలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ దోమల ద్వారా విడుదల విడుదల అయ్యే లార్వాను ఈ చేప పిల్లలు అధికంగా తింటాయని, తద్వారా దోమలు వృద్ధి చెందకుండా అరికట్టవచ్చున్నారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ నాయుడు, హెల్త్ అసిస్టెంట్ జయకృష్ణ, ఎంఎల్‌హెచ్‌పి సాయిమణి పాల్గొన్నారు.


చేపలను వేస్తున్న అధికారులు

రాష్ట్ర స్థాయి పోటీల్లో సత్తా

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:ఈ నెల 29, 30 తేదీల్లో రాజమండ్రి ఫారెస్ట్ కళ్యాణ మండపంలో జరిగిన స్టేట్ సీనియర్ ఉషూ టోర్నమెంట్‌లో నర్సీపట్నంకు చెందిన ఇద్దరు క్రీడాకారులు రెండు పతకాలు సాధించారు. స్వర్ణ పతకం వేపాడ ప్రియాంక(75 కేజీల విభాగంలో) స్వర్ణ పతకం సాధించారు. ఉలం రవికుమార్(70 కేజీల విభాగం)లో సాధించారు. అనకాపల్లి వుషు సెక్రటరీ, నేషనల్‌రిఫరీ వెంకటేష్ సమక్షంలో వీరిని తీసుకువెళ్ళి వచ్చారు. ఈ పోటీలు స్టేట్ ఉషు అసోసియేషన్ వారు నిర్వహించారు. ఏపీ అసోసియేషన్ ఫౌండర్, టెక్నికల్ చైర్మన్ మోహన్ ముత్యాలరావు వీరిని ప్రత్యేకంగా అభినందించారు.


ఫిర్యాదు చేస్తున్న వైసిపి నేతలు

వికలాంగుల పింఛన్ల తొలగింపుపై ఫిర్యాదు

ప్రజాశక్తి-గొలుగొండ:గొలుగొండ మండలం పాకలపాడు పంచాయితీలో వికలాంగుల పెన్షన్లు అక్రమంగా తొలగించారని ఎంపిడిఓ డేవిడ్‌రాజుకు వైసీపీ నాయకులు శనివారం ఫిర్యాదు చేశారు. తక్షణమే ఈ పింఛన్ల విషయమై విచారణ చేసి వారికి న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల పార్టీ అధ్యక్షులు లెక్కల సత్యనారాయణ, పాకలపాడు వైసిపి నాయకులు పెదబాబులు, నాయుడు పాల్గొన్నారు.


వినతిపత్రం ఇస్తున్న కార్మికులు

వేతనాలు చెల్లించండి

ప్రజాశక్తి -కోటవురట్ల: గడిచిన నాలుగు నెలలుగా మండల కేంద్రంలో శానిటేషన్, సెక్యూరిటీ, కంట్రోల్ కార్మికులకు గడిచిన నాలుగు నెలలుగా వేతనాలు అందక పోవడంతో శనివారం సిహెచ్‌సి సూపరిండెంట్ నాగేంద్ర ప్రసాద్‌కు వినతి పత్రం అందజేశారు. ప్రధానంగా వేతనాలు చెల్లించాలని, సెలవులు ప్రకటించాలని, కార్మికులకు యూనిఫాంలో సకాలంలో అందజేయాలని కోరారు.అదేవిధంగా రెస్ట్ రూమ్, రొటీన్ పద్ధతిలో షిప్టుల పని విధానం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మహిళ కార్మికులు సెక్యూరిటీ గార్డులు పాల్గొన్నారు.

ఎస్ఐ రామారావు బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-గొలుగొండ:గొలుగొండ ఎస్సైగా రామారావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. అనకాపల్లి సిఎంఎస్ డిపార్టుమెంట్ నుండి ఈయన బదిలీపై వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా పోలీసు సిబ్బందికి ఆయన్ను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.




పందిరి రాట వేస్తున్న గ్రామ పెద్దలు

వినాయక చవితికి పందిరి రాట

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలోని ఉపమాక మెరక వీధి రామాలయం వద్ద శనివారం గ్రామ పెద్ద చేతుల మీదుగా పందిరిలాట వేశారు. సెప్టెంబర్ 7వ తేదీన వినాయక చవితి పురస్కరించుకుని పందిరి రాటవేసినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. గణపతి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ప్రగడ వీరబాబు, జిల్లా పరిషత్ కోఆప్షన్ మాజీ సభ్యులు కొప్పిసెట్టి కొండబాబు, కొపిసెట్టి బుజ్జి ,వెంకటరమణ, మీగడ ఈశ్వరరావు నూక తాత , ప్రగడ బుజ్జి సుంకర శ్రీనివాసరావు, బుల్లి బాబు ,సత్తిబాబు ,బద్ది హరిబాబు తదితరులు పాల్గొన్నారు .

పలు పాఠశాలల్లో ఎస్ఎంసి ఎన్నికలు


సీతయ్యపేటలో ఎన్నికైన సభ్యులు

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట:మండలంలోని సీతయ్యపేట జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఎస్ఎంసి) ఎన్నికలు శనివారం జరిగాయి. ఎస్ఎంసి చైర్మన్‌గా పిల్లా మహేష్, వైస్ చైర్‌పర్సన్‌గా తోట పద్మను, సభ్యులను విద్యార్థుల తల్లిదండ్రులు ఎన్నుకున్నారు. వారి చేత ప్రధానోపాధ్యాయులు గరిక పాటి విష్ణు ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో సర్పంచ్ వజ్రపు ఇందిరా శ్రీను, మాజీ సర్పంచ్ కరణం నాగేశ్వరరావు, కొండపల్లి సత్యారావు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పాత కొండేంపూడి, కొత్త కొండేంపూడి పాఠశాల విద్యా కమిటీ ఎన్నికలు కూడా జరిగాయి. కొత్త కొండేంపూడి విద్యా కమిటీ చైర్మన్‌గా నేమాలదేవి, వైస్ చైర్మన్‌గా ఆదిమహేష్, పాత కొండేంపూడి చైర్మన్‌గా ఆది శ్యామ్ కుమార్, వైస్ చైర్మన్ దొండ నానాజీ ఎన్నికయ్యారు. వీరికి ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులు, సర్పంచ్ ఆది సత్యనారాయణ అభినందనలు తెలిపారు.

వడ్డాది : బుచ్చయ్యపేట మండలం వడ్డాది కేజీబీవీ స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్‌గా జనసేన మద్దతుదారులు యడ్ల సత్యవేణి, వైస్ చైర్మన్‌గా డొంకిన శ్రీనివాసరావు, మరో 13 మంది సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరి చేత కేజీబీవీ ప్రిన్సిపల్ కోసూరి అన్నపూర్ణ ప్రమాణ స్వీకారం చేయించారు. నూతనంగా ఎన్నికైన ఎస్ఎంసి సభ్యులను స్థానిక సర్పంచ్ కె కామలక్ష్మి, ఉప సర్పంచ్ దాడి సూరిబాబు, టిడిపి, వైసిపి, జనసేన టౌన్ అధ్యక్షులు దొండా నరేష్, నారాయణ మూర్తి, సాయి, కూటమినేతలు పొలిమేర కృష్ణ, దూది రాజేష్, రమేష్, రసూల్, సాయం శేషు, తదితరులు అభినందించారు.

దేవరాపల్లి : మండలంలోని తెనుగుపూడి డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల / కళాశాలలో శనివారం స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ ఎన్నిక జరిగింది. కమిటీ చైర్మన్‌గా ఇరటా నరసింహమూర్తి (చీడికాడ మండలం రేళ్ళల పాలెం), వైస్ చైర్మన్‌గా కాటేపల్లి లక్ష్మి (దేవరాపల్లి) కో ఆప్షన్ సభ్యులుగా ఉల్లి శ్రీను, మరో 18 మంది సభ్యులుగా ఎన్నికయ్యారు. వీరి చేత ప్రమాణ స్వీకారం చేయించారు. ప్రిన్సిపాల్ డి.జయప్రకాష్, వైస్ ప్రిన్సిపాల్ పి. రఘు, పిఈటి జి. తరుణేశ్వరరావు, ఉపాధ్యాయ, అధ్యాపక సిబ్బంది నూతన కమిటీ సభ్యులను అభినందించారు.

కొత్తకోట:రావికమతం మండలంలో శనివారం నిర్వహించిన పాఠశాల మేనేజ్మెంట్ కమిటీ ఎన్నికలలో ఐదు పాఠశాలల ఎన్నికలు పూర్తి కాగా కోరం లేక వమ్ము వరం ప్రాథమిక పాఠశాల మేనేజ్మెంట్ కమిటీ ఎన్నిక వాయిదా పడిందని ఎంఈఓ తలుపులు తెలిపారు. ఈనెల 17న మండలంలో 71 పాఠశాలకు గాను 65 పాఠశాలలో మేనేజ్మెంట్ కమిటీ ఎన్నికలు పూర్తి అయిన విషయం తెలిసిందే. వమ్మువరం, సాయి నగర్, గుడ్డిప, కసిరెడ్డి పాలెం, మరుపాక ప్రాథమిక పాఠశాల, మరుపాక మోడల్ స్కూల్ కమిటీ ఎన్నికలు వివిధ కారణాలతో వాయిదా పడ్డాయి. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తిరిగి శనివారం ఈ పాఠశాలలో ఎన్నికలు నిర్వహించగా వమ్మువరం పాఠశాలలో కోరం లేక ఎన్నికలు మళ్లీ వాయిదా పడ్డాయి. మిగిలిన ఐదు పాఠశాలలో కమిటీలు ఎన్నిక ప్రక్రియ ముగిసింది.


కొత్తకోటలో మాట్లాడుతున్న ఉపాధ్యాయులు

శ్రావణ్ షిప్పింగ్స్‌లో ప్రమాదంపై సమగ్ర విచారణ జరపాలి

- సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గు నాయుడు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : శ్రావణ్ షిప్పింగ్ ప్రమాదంపై సమగ్ర విచారణ జరిపి, ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు విజ్ఞప్తి చేశారు. శనివారం ఈ మేరకు జిల్లా కలెక్టర్‌కు ఈ-మెయిల్ ద్వారా వినతి పత్రం పంపారు. పారిశ్రామిక ప్రాంతంలోని శ్రావణ్ షిప్పింగ్ గోడౌన్స్‌లో రసాయనాల పౌడరు, లోడింగ్, అన్ లోడింగ్ పనులు జరుగుతుండగా ఆగస్టు 30న అర్ధరాత్రి విషవాయువులు పీల్చి కార్మికులు అస్వస్థతకు గురై ఆసుపత్రి పాలుకావడం అత్యంత ఆందోళనకరమని పేర్కొన్నారు. వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉందని తెలిసిందన్నారు. ఈ ప్రమాదానికి గురైన కార్మికులపై యాజమాన్యం నిర్లక్ష్యం వహించకుండా పూర్తిస్థాయిలో వైద్యం అందించే చర్యలు చేపట్టాలన్నారు. శ్రావణ్ షిప్పింగ్ గోదాముల్లో పెద్ద ఎత్తున రసాయనాల నిల్వలు లోడింగ్, అన్ లోడింగ్ పనులు జరుగుతున్నాయని, పేలుడు స్వభావం కలిగినవి ఉన్నాయని అన్నారు. ఈ నేపథ్యంలో భద్రతను కట్టుదిట్టం చేసేలా శ్రావణ్ షిప్పింగ్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలన్నారు. శ్రావణ్ షిప్పింగ్ గోదాములకు సమీపంలో పారిశ్రామిక ప్రాంతంలోని 40వ వార్డు, 58 నుండి 63 వార్డుల వరకు, గాజువాక పరిధిలోని 67, 68, 69 వార్డుల ప్రజలు సుమారు 2 లక్షల మంది ప్రజలు నివసిస్తున్నారన్నారు. ప్రమాద తీవ్రత పెరిగితే వీరందరూ ప్రమాదంలో పడతారన్నారు. జనావాసాల మధ్య ఇటువంటి కార్యకలాపాలు అనుమతించడమే సరికాదన్నారు. భద్రత ఎడల యాజమాన్యం నిర్లక్ష్యానికి ప్రజలు భారీ మూల్యం చెల్లించుకునే పరిస్థితి రాకూడదని తెలిపారు.




మాట్లాడుతున్న అనిత

వాయుగుండంపై అప్రమత్తం

- హోం మంత్రి అనిత

ప్రజాశక్తి -నక్కపల్లి: భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మంత్రులు, అధికారులతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎలాంటి ప్రాణనష్టం జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత తెలిపారు. పాయకరావుపేటలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ, తనను కూడా కమాండ్ కంట్రోల్ రూమ్ లో అందుబాటులో ఉండి పరిస్థితులను పరిరక్షించాలని ఆదేశించారని తెలిపారు.తుఫాన్ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. లోతట్టు ప్రాంతాల్లో ఉండే ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలిస్తామన్నారు.అధికారులు అందుబాటులో ఉంటూ ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు.పంట నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు.



అధ్యాపక దంపతులను సన్మానిస్తున్న అధ్యాపకులు

కెమిస్ట్రీ అధ్యాపకులు ఉద్యోగ విరమణ

ప్రజాశక్తి - మాడుగుల: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కెమిస్ట్రీ అధ్యాపకులు ఉద్యోగ విరమణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. శనివారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల కెమిస్ట్రీ లెక్చరర్ గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్. ఆర్.వి. రమణమూర్తి ఉద్యోగ విరమణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి వి ఎస్ ఎస్ శాస్త్రి రమణమూర్తి సేవలను కొనియాడారు. కళాశాల ప్రిన్సిపాల్ సిబ్బంది, విద్యార్థులు రమణమూర్తి దంపతులను సత్కరించారు.

బిఎన్ రోడ్డు మరమ్మతు చేపట్టాలి

వామపక్షాల వినూత్న నిరసన



చేపలు పడుతూ నిరసన చేపడుతున్న నేతలు

ప్రజాశక్తి -కొత్తకోట: ప్రమాదాలకు నిలయంగా మారిన భీముని పట్నం - నర్సీపట్నం ఆర్ అండ్ బి రోడ్డులో తక్షణమే కనీస మరమ్మత్తులు చేపట్టాలని డిమాండ్ చేస్తూ సిపిఎం, సీపీఐ, ఆదివాసి సంఘం ఆధ్వర్యంలో కొత్తకోట జిల్లా పరిషత్ పాఠశాల సమీపంలో శనివారం రోడ్డు మధ్యలో చేపలు పట్టి మొక్కలు నాటి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్య వర్గ సభ్యులు కె. గోవిందరావు, సీపీఐ మండల కార్య దర్శి జి. జోగిరాజు మాట్లాడుతూ, రావికమతం, రోలుగుంట,బుచ్చయ్య పేట మండలాల ప్రజల రవాణా తో పాటు విశాఖ ఉమ్మడి జిల్లాలను అను సంధానం చేసే బిఎన్ రోడ్డు గత ఏడేళ్ల గా శిదిలావస్థ కు చేరినా పాలకులు పట్టించుకోలేదన్నారు. వందల కొలది వాహనాలు రాకపోకలు సాగించే ఈ రహదారి అడుగుకో గొయ్యి పడి ప్రమాదాలకు నిలయంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. గత పాలకులు చేయలేని పనులు గెలిచిన వెంటనే చేసి చూపిస్తామని ప్రకటనలు చేసిన అనకాపల్లి పార్లమెంటు సభ్యులు, చోడవరం శాసనసభ్యులు వంద రోజులు అవుతున్నా కనీసం గొయ్యిలు కూడా పూడ్చ లేదన్నారు. ఈ రహదారిలో గర్భిణీ స్త్రీ లు ప్రయాణం చేయాలంటే తీవ్ర భయాందోళన చెందుతున్నారని పేర్కొన్నారు. ఈ రహదారిలో రోజుకి కనీసం 10 రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు పట్టించుకోక పోతే ఇతర వామపక్షాల ప్రజా సంఘాలతో సెప్టెంబర్ 10న బి ఎన్ రోడ్డులో బంద్ చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం మండల అధ్యక్షులు గేమిల వాసు. వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు సిహెచ్ సూరిబాబు పాల్గొన్నారు...

ప్రమాదాలు..పర్యటనలు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

గడిచిన వారం రోజులుగా ఉమ్మడి విశాఖ జిల్లా పలు ప్రమాదాలకు నిలయంగానూ, ప్రముఖుల పర్యటనలకు వేదికగానూ నిలిచింది. కేంద్ర, రాష్ట్ర నాయకులు, అధికారుల రాకపోకలతో హడావుడిగా కనిపించింది. జాతీయ ఆర్థిక సదస్సు ఒక రోజంతా విశాఖ నోవటల్‌లో జరిగింది. రాష్ట్రాలకు చెందిన ప్రిన్సిపల్ సెక్రటరీలు హాజరయ్యారు. విశాఖ అంతర్జాతీయ నగరంగా రూపుదిద్దుకోడానికి అన్ని అర్హతలూ ఉన్నాయనడానికి గడచిన కొంత కాలంగా ఇక్కడ జరుగుతున్న జాతీయ, అంతర్జాతీయ ఫోరమ్‌లనే కారణంగా చూపొచ్చు. అయితే విశాఖకు ఏమైనా ఒరిగిందా ? ఇక్కడ ఉపాధి అవకాశాలు ఏమైనా మెరుగుపడుతున్నాయా ? కొత్తగా కంపెనీలు ఏమైనా వచ్చాయా ? అన్న అంశాలను బేరేజు వేసుకుంటే మరలా కనుచూపు మేరలో ఏమీ అగుపడదు. ఈ మధ్య కేంద్ర పోర్టులు, షిప్పింగ్ మంత్రి శర్బానంద్ సోనోవాల్ విశాఖ పోర్టుకు విచ్చేశారు. మేజర్ పోర్టుల కార్మికుల వేతన సవరణకు అంగీకరించడంతో కార్మికులంతా హర్షం వ్యక్తం చేశారు.



మరోపక్క రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మొదలుకొని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి లోకేష్, రాష్ట్ర డిజిపి ద్వారకా తిరుమలరావు రాకపోకలు, సమీక్షలు, పరామర్శలు చోటుచేసుకున్నాయి. చంద్రబాబు పర్యటన ఫార్మా బాధితులను, వారి కుటుంబ సభ్యులను కొంత ఓదార్చింది. నష్ట పరిహారాన్ని అక్కడికక్కడే ప్రకటించారు. మంత్రి లోకేష్ స్కూళ్లలో పర్యటించి పరిస్థితులను తెలుసుకున్నారు. అయితే వీటన్నింటా దండలో దారం మాదిరిగా కనిపించిన విషయం ఏమిటంటే 'స్వోత్కర్ష..పరనింద'. ప్రతి సన్నివేశాన్ని, సంఘటననూ గతానికి వర్తింపజేస్తూ రాజకీయ ఉపన్యాసాలు చేయడం పైన తెలిపిన ప్రముఖులంతా చేసిన పనే. ఒక కంపెనీ వల్ల ప్రమాదం జరిగి ప్రజల ప్రాణాలు కోల్పోతే సదరు యాజమాన్యంపై సరైన చర్య తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అయితే, ఉమ్మడి విశాఖ జిల్లాలో జరిగిన ఫార్మా ప్రమాదాల్లో ఇప్పటికీ యాజమాన్యాలు సేఫ్‌గా ఉంటున్నాయి.

వరుస ప్రమాదాలతో ఉక్కిరిబిక్కిరి

ఎసెన్షియా, సినర్జిన్ కంపెనీల్లో ఇటీవల వరుస ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. వాటిని పరిశీలిస్తే యాజమాన్యాలు మునుపటి నిర్లక్ష్య ధోరణినే అవలంబిస్తున్నట్టు అర్థమవుతుంది. ఇవన్నీ ఒక ఎత్తయితే ఉమ్మడి విశాఖ జిల్లాలో కలుషిత ఆహారంతో పిల్లలు సతమతమైపోయారు. కోటవురట్ల, డుంబ్రిగుడ ప్రాంతాల్లో విద్యార్థులు ఆసుపత్రుల పాలయ్యారు. వ్యవస్థల నిర్వహణను పాలకులు పట్టించుకునే పరిస్థితులు నానాటికీ క్షీణించిపోతున్నాయనడానికి ఇవన్నీ తార్కాణాలుగా నిలుస్తున్నాయి. విశాఖ నగరంలోనూ, జిల్లాలోనూ విపరీతంగా డయేరియా, ఇతర వైరల్ ఫీవర్లతో జనం అల్లాడుతున్నారు. కేసులు పెరిగిన తర్వాతగానీ వైద్య శాఖ మేల్కొనకపోవడం రివాజైపోయింది.

పింఛన్ల తొలగింపుపై.. మున్సిపల్ సమావేశంలో రగడ



మాట్లాడుతున్న కౌన్సిలర్ పద్మావతి



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ సుబ్బలక్ష్మి

ప్రజాశక్తి నర్సీపట్నం టౌన్: మున్సిపల్ చైర్ పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి అధ్యక్షతన శనివారం జరిగిన సాధారణ సమావేశం రసాభాసగా కొనసాగింది. ముందుగా కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పెన్షన్ల తొలగింపుపై తీవ్ర స్థాయిలో చర్చ జరిగింది. వైసీపీ, టీడీపీ కౌన్సిలర్ల మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. వైసిపికి చెందిన 17వ వార్డు కౌన్సిలర్ ఆదిలక్ష్మి 17వ వార్డులో దళితులకు సంబంధించిన నిరుపేదలైన 10 మంది పింఛన్లు తొలగించారని, వీరిలో చెప్పులు కుట్టుకునేవారు, రిక్షా కార్మికులు, ఇతర నిరుపేదల పెన్షన్లు తొలగించడం అన్యాయమన్నారు.
తెలుగుదేశం పార్టీకి చెందిన వార్డు కౌన్సిలర్ చింతకాయల పద్మావతి సమాధానం ఇస్తూ దేవుడు అందరిని ఒకేలా పుట్టించడని, కులాలు మనం సృష్టించుకున్నామని, కేవలం దళితులు పెన్షన్లు అంటూ కులాలు అంటకట్ట వద్దని ఆమె అన్నారు. పింఛన్ల తొలగింపుపై వివరాలు తెలుసుకుని అర్హత ఉంటే పింఛన్లు కొనసాగించడం జరుగుతుందని తెలిపారు. ఈ విషయాన్ని తాను స్పీకర్ అయ్యన్నపాత్రుడు దృష్టికి తీసుకువెళ్లి న్యాయం చేస్తానని చెప్పారు. అస్సలు దళితుల పింఛన్లు తొలగించడానికి గల కారకులు ఎవరో తెలియాలని ఆదిలక్ష్మి డిమాండ్ చేశారు. టీడీపీ కౌన్సిలర్లు మధు, శ్రీకాంత్ మాట్లాడుతూ, గత ప్రభుత్వ హయాంలో సోషల్ ఆడిట్ పేరుతో మున్సిపాలిటీలో 650మంది పింఛన్లు తొలగించారని, అప్పుడు తెలుగుదేశం పార్టీ పోరాటం చేసి అర్హత ఉన్న ప్రతీ ఒక్కరికి పింఛన్లు ఇప్పించడం జరిగిందన్నారు. మున్సిపాలిటీలో అన్ని కులాలకు చెందిన పెన్షనర్లు ఉన్నారన్నారని, తొలగించిన పది మందికి న్యాయం చేస్తామని చెప్పినప్పటికీ వాదన చేయడం ఏంటని ప్రశ్నించారు.
జనసేన కౌన్సిలర్ అద్దేపల్లి సౌజన్య మాట్లాడుతూ మున్సిపాలిటీ వాహనాలకు వినియోగించిన డీజిల్ బిల్లుల ఖర్చులో పెద్ద ఎత్తున అవకతవకలు జరిగాయని దీనిపై ఎవరూ పట్టించుకోలేదని మున్సిపల్ కమిషనర్ సురేంద్ర దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై సురేంద్ర మాట్లాడుతూ, ఈ వ్యవహారంపై పూర్తి స్థాయిలో అడిట్ చేయిస్తానని, సమీక్ష జరిపి రుజువైతే తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. నర్సీపట్నం మున్సిపాలిటీకి స్పీకర్ అయ్యన్నపాత్రుడు రూ.4.11కోట్లు మంజూరు చేశారని, ఈ నిధులతో రోడ్లు, డ్రైన్లు నిర్మిస్తామని చెప్పారు. కాలువల్లో పూడిక తీయడానికి మరో రూ.40 లక్షలు మంజూరు చేయించారన్నారు. వైసిపి కౌన్సిలర్ మాకిరెడ్డి బుల్లిదొర మాట్లాడుతూ పెదబొడ్డేపల్లి శ్మశానం వద్ద ప్రజల కోసం ఒక షెడ్ నిర్మించాలని కోరారు.

డిగ్రీ కళాశాలను సందర్శించిన స్పీకర్ అయ్యన్న

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: నర్సీపట్నం ప్రభుత్వం డిగ్రీ కళాశాలను రాష్ట్ర శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా కళాశాలకు సంబంధించిన విద్యాబోధన, ఇతర అవసరాలపై ప్రిన్సిపాల్ రాజును అడిగి తెలుసుకున్నారు. టాయిలెట్లను వెంటనే పూర్తి చేయాలని కాంట్రాక్టరును ఆదేశించారు. పర్యటనలో భాగంగా, స్పీకర్ మొక్కలు నాటారు. జిమ్ ను అందుబాటులోకి తీసుకురావడం కోసం చర్యలు తీసుకుంటానని స్పీకర్ అయ్యన్నపాత్రుడు తెలిపారు. నిరుపయోగంగా ఉన్న సైకిల్ స్టాండ్‌కు కొత్త రేకులు వేసి మరమ్మతులు చేయిస్తానని కూడా హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ రాజు కంప్యూటర్లు, పోడియం, ఫర్నిచర్, మైక్ సెట్ వంటి సదుపాయాలపై అవసరాన్ని స్పీకర్‌కు తెలియజేసారు. ప్రిన్సిపల్ అడిగిన సదుపాయాలు వీలైనంత త్వరగా కాలేజీకి అందుబాటులోకి తీసుకొస్తామని వారికి తెలిపారు.



మాట్లాడుతున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు